ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ

# తెలుగులో రామాయణాలు

రచయిత

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

కళాభవన్, సైఫాబాదు,

హైదరాబాదు—500004

ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ

# తెలుగులో రామాయణాలు


రచయిత

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

కళాభవన్, సైఫాబాదు,

హైదరాబాదు–500004

ప్రథమ ముద్రణ

1975

ప్రతులు : 2000

© ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

మూల్యము . 2–00

ముద్రణ :

గాయత్రీ ప్రింటింగ్ అండ్ బుక్‌బైండింగ్ వర్క్స్

విద్యానగర్, హైద్రాబాద్-44

# ముందుమాట

ఎన్నో ఏళ్లుగా అనుకుంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధులందరిని ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్న కలలు ఫలిస్తున్న శుభ సమయమిది. రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుండి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదుకోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడేవారి తరువాతిస్థానం తెలుగువారిది. బౌద్ధ పూర్వయుగమునుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలనాయుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్ళడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్కృతి సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలలో మేళవించి, వాటిని సుసంపన్నంగా చేస్తూ ఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవటానికీ, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహద కారులు అవుతవి అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భాషా సమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవనీ విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన, తెలుగు ఉగాదిరోజున, ప్రారంభమై ఒక వారం రోజులపాటు జరిగే ఈమహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాలనుంచీ, యునెస్కోవంటి అంతర్జాతీయ సంస్థలనుంచీ విచ్చేసిన ప్రముఖులు ప్రతి

నిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చా గోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చా గోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటం చేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని (మ్యూజియంను) స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజ భూతమవుతుంది. తెలుగువారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకువచ్చిన అకాడమీ అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగువారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంతమాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడుతున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు
ప్రపంచ తెలుగు మహాసభలు.

# పరిచయము

సహస్రాబ్దాలుగా ప్రశస్తమానమగుచున్న తెలుగు సంస్కృతిని తెలుగు దేశపు నలుచెరగుల పరిచితముచేయు సంకల్పముతో 1975వ సంవత్సరమును తెలుగు సాంస్కృతిక సంవత్సరముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రకటించినది. అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహింప జేయుటయేగాక, ప్రపంచములోని వివిధ దేశాలలో నివసించుచున్న తెలుగువారి సాంస్కృతిక ప్రతినిధులందరను ఒక చోట సమావేశమగు వసతిని కల్పించుటకై, 1975, ఏప్రిల్ 12 (తెలుగు ఉగాది) మొదలుగ ప్రపంచ తెలుగు మహాసభలు హైదరాబాదున జరుగునటుల ప్రభుత్వము నిర్ణయించినది. అందుకు ఒక ఆహ్వానసంఘము ఏర్పాటయినది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి మాన్యశ్రీ జలగం వెంగళరావుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు, విద్యాశాఖామంత్రి మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు దాని కార్య నిర్వాహకాధ్యక్షులు. ఆర్థికమంత్రి మాన్యశ్రీ పిడతల రంగారెడ్డిగారు ఆర్థిక, సంస్థా కార్యక్రమాల సమన్వయ సంఘాల అధ్యక్షులు.

ఆ సంఘము, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వచ్చువారికి తెలుగుజాతి సాంస్కృతిక వైభవమును తెలియజేయుటకు అనువుగ ఆంధ్రభాషా సాహిత్య, కళా చరిత్రాదికములను గురించి ఉత్తమములు, ప్రామాణికములునగు కొన్ని లఘు గ్రంథములను ప్రకటించవలెనని సంకల్పించి, ఆ కార్యనిర్వాణకై 44 మంది సభ్యులు కల ఒక విద్వత్సంఘమును, శ్రీ నూకల నరోత్తమరెడ్డిగారి అధ్యక్షతన నియమించినది. ఆ విద్వత్ సంఘము ఆ లఘుగ్రంథముల వస్తువుల నిర్దేశించి వాని రచనకై ఆ యా రంగములందు పేరుగనిన ప్రముఖులను రచయితలుగ యెన్నుకొనినది. ఈ విధముగ సిద్ధమైన గ్రంథములలో భాషా, సాహిత్య, చారిత్రక విషయములకు సంబంధించిన వానిని ప్రకటించు బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వహింప వలసినదిగ ప్రపంచ తెలుగు

మహాసభా కార్యానిర్వాహకాధ్యక్షులు మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు అకాడమీని కోరిరి. మహాసభ సఫలతకొరకై కృషిచేయు సంకల్పముతో ఈ బాధ్యతను వహించుటకు అకాడమీ సంతోషముతో అంగీకరించినది.

ఆ విధముగ ప్రకటింపబడిన గ్రంథశ్రేణిలో ఈ తెలుగులో రామాయణాలు అను గ్రంథమును, రచించిన శ్రీ మల్లంపల్లి సత్యనారాయణశాస్త్రిగారు ఆంధ్ర పాఠకలోకమునకు సుపరిచితులు వారికి మేము కృతజ్ఞతాబద్ధులము. గ్రంథమును నిర్దుష్టముగ, చక్కగ ముద్రించిన జయశ్రీ ప్రింటింగ్ అండ్ బుక్ బైండింగ్ వర్క్స్ ప్రెస్‌వారికి మా కృతజ్ఞత.

హైదరాబాదు,
తేది. 30-3-75

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

# "తెలుగులో రామాయణాలు"

## శ్రీమద్రామాయణము: వాల్మీకము:

సంస్కృత సారస్వతములో ప్రపంచప్రఖ్యాతములైన మహాగ్రంథములు మూడు: భారతము, భాగవతము, రామాయణము. భారతీయులకీ గ్రంథములు వేదము తరువాత వేదములు. భారతము మహేతిహాసము. భాగవతము మహాపురాణము. రామాయణము మహాకావ్యము. భారత భాగవతములు వ్యాసప్రోక్తములు, రామాయణము వాల్మీకి ప్రణీతము. వ్యాసవాల్మీకులు మహర్షులు; ద్రష్టలు ఒక ప్రాచీన శ్లోకమిట్లు చెప్పుచున్నది:

"భాగవతమును తెలుసుకొనుటకు భక్తి యుండవలెను. భారతమును తెలిసి కొనుటకు భక్తియు, యుక్తియు నుండవలెను. రామాయణమును గ్రహించుటకు భక్తి యుక్తులు రెండే కాదు శక్తికూడ నుండవలెను."

ఈ లక్షణములు మొదటనే అంచటిలో నుండుట అసాధ్యము. మరి, రామాయణము విశ్వజనీయమైన కావ్య మెట్లగును? దీని తాత్పర్యము: భక్తితో రామాయణము చదివినవారికి విన్నవారికి యుక్తి శక్తులు క్రమముగా సిద్ధించును. భక్తి భగవంతునియందు పరమ ప్రేమ రూపము. యుక్తియనగా ఆలోచనము శక్తి యనగా ప్రతిభ. ఈ మూడును ఎవనియందు నిండారునో వానికి ఆనంద రసఘుటిక అరచేతిలోని రేగు పండు.

కావ్యము రసప్రధానము. రామాయణములోని ముఖ్యరసము కరుణము. శృంగార వీరాదులు ఆనుషంగికములైన రసములు. సీతారాములు నాయికానాయకులు. ప్రతినాయకుడు రావణుడు. గ్రంథము ఏడు కాండములుగా నున్నది. బాల, అయోధ్యా, అరణ్య, కిష్కింధా, సుందర, యుద్ధ, ఉత్తర కాండములు, అయిదువందల సర్గలు. ఇరువది నాలుగువేల శ్లోకములు, సప్తసంఖ్యలో విశేషమున్నది. దశావతారములలో రామావతారము ఏడవది; లంకలో యుద్ధము

జరిగిన రోజులు ఏడు; రాముని జన్మతార పునర్వసు ఇరు దివేడు నక్షత్రముల లెక్కలో ఏడవది.

ఇరువదినాల్గు సంఖ్యలో ఒక ప్రత్యేకత గాయత్రీమంత్రాక్షరములు ఇరువది నాల్గు. వాల్మీకి రామాయణములలోని ప్రతివేయవ శ్లోకము ఆ మంత్రాక్షరముతో నారంభమగును. దానివలన రామాయణము పారాయణము చేయుటవలన కార్యసిద్ధు లగుచున్నవి. మనోహరమైన కవిత్వానందముతోపాటు మహిమసిద్ధి ను ప్రసాదించు మహాగ్రంథము రామాయణము. కవులకు పరమాధారమైన కబ్బమదియొకటే. కాళిదాసుభాషలో కవి యనగా వాల్మీకియే.

వేదమంత్రముల వలన తెలిసికొనదగిన పరమాత్మ దశరథాత్మజుడుగా నవతరించెను. తన పుట్టుకనుగూర్చి రామాయణమే యిటుల చెప్పుకొన్నది: వాల్మీకి తమసానదికి స్నానమునకు బోయెను. శిష్యుడు భరద్వాజుడు వెంట నున్నాడు. నది యొడ్డున నుండగా వాల్మీకి మహర్షి కొక దృశ్యము కంటబడెను. కిరాతు డొకడు చెట్టు పై విహరించుచున్న క్రౌంచమిథునములో మగపిట్టను బాణముతో కొట్టెను. దెబ్బతో నది గిజగిజ తన్నుకొని క్రిందపడిపోయెను. ఆడు పక్షి విలపించుచుండెను. మహర్షి చూచెను దాని యాక్రందమునకు ఆయన డెందము కరుణార్ద్రమయ్యెను. ఆకస్మికమైన మహర్షి హృదయశోకము శ్లోక రూపముగా వెలువడెను

మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః।
యత్క్రౌంచ మిథునా దేక మవధీః కామ మోహితమ్॥

" ఓ కిరాతుడా! క్రౌంచ పక్షుల జంటలో కామవశమైన మగపక్షిని చంపితివి. నీవు పెక్కేండ్లు జీవింపజాలవు సుమా!"

ఇది బోయవానికి వాల్మీకి మహర్షి తిట్టు. శిష్యుడు భరద్వాజుడు ప్రక్కనే ఉన్నాడు. విన్నాడు. ఆశ్చర్యము! ఆ శాపము పిట్టిమాటలుకాదు. అనుష్టుప్ అను పేరుగల ఛందస్సు; దానిలో నాల్గు పాదములు. ప్రతి పాదమున నమాక్షరములు. వాల్మీకి అప్రయత్నముగా నిట్లు తనలోనుండి వెలువడిన ఛందో వాణికి తానే అబ్బురపడెను. ఇది కిరాతున కిచ్చిన శాపము మాత్రమేకాదు. రామాయణ

ములోని సర్వగాథయు ఈ శ్లోకము యొక్క అర్థములో బీజప్రాయముగా నున్నది. ఈ సంఘటనము వెనువెంటనే బ్రహ్మ వాల్మీకికి దర్శనమిచ్చి "ఓయీ! నీ నోట సరస్వతి వెలువడినది. ఇది నా సంకల్పము. ఇక నీవు రామాయణము రచింపుము. భూతలమున శాశ్వతముగా నుండగలదు" అని సెలవిచ్చి అంతర్హితుడయ్యెను. రామాయణ మహాకావ్యరచనకు కారణము బ్రహ్మానుగ్రహము. ఉద్బోధకము నారదోపదేశము. సంస్కృతభాషలో సంధులు సమాసములు అలంకారములు మున్నగు సర్వకావ్య సామగ్రికి మార్గదర్శి వాల్మీకి మహర్షి కవిత్వావతార ప్రథమ తీర్థము.

శ్రీ రామాయణ మనగానేమి: రామునకు అయనమైనది. అయన మనగా చోటు. రామగాథకు నెలవైన గ్రంథమని యర్థము. ణకారము వ్యాకరణ సూత్రముచే వచ్చినది. మరియొక అర్థముకూడ చెప్పుదురు. శ్రీరామా అనగా లక్ష్మి. ఈ గ్రంథములో సీతయే లక్ష్మి. కనుక "సీతాచరితము" రామాయణము. వెరసి-సీతారామ చరిత్రము. రామ లక్ష్మణ హనుమద్విభీషణాదుల చరితములుండుటచే రామాయణము చదువుటవలన ఎన్నో సద్గుణము లలవడుట కవకాశమున్నది. తలిదండ్రుల యెడల భక్తి-సోదర ప్రీతి-జ్యేష్ఠానువర్తనము-లోక మర్యాదానుసరణము-ప్రతిజ్ఞా పాలనము-ఆశ్రిత వాత్సల్యము-స్వామికార్య నిర్వహణము-స్వార్థ పరత్వ నివృత్తి-చిత్త శుద్ధి- పరోపకార బుద్ధి - మున్నగునవి.

శ్రీరాముడు దైవము. రామాయణములో ఇది మూడు నాల్గు చోట్ల వెల్లడి చేయబడెను. మొత్తము గ్రంథములో రాముడు ఉత్తముడైన మానవుడుగానే వ్యవహారము జరుపుకొని పోయినట్లుండును. కావ్యమంతయు చదివిన తర్వాత 'మనము మానవుడనుకొన్న రాముడు దేవుడేరా!' అని పించును. ఈ స్ఫూర్తి మనకు ఎట్లుకలిగెను: అదియే వాల్మీకిలోని అతిలోక ప్రతిభా విశేషము.

వాల్మీకి తరువాత మఱికొందఱు మహర్షులును రామగాథలు పలికిరి. వసిష్ఠుడు, విశ్వామిత్రుడు, అగస్త్యుడు, దుర్వాసుడు మున్నగువారు. సంస్కృత భాషలో నూటయెన్మిది రామాయణము లున్నవట! భారతము, భాగవతము, పద్మ పురాణము, అగ్ని పురాణము, స్కాందము, దేవీ భాగవతము, ఇంకను పలు చోట్ల రామగాథ కొంచెమో గొప్పో వర్ణితము. సంస్కృతములోనే వాల్మీకము

ఆధారముగా మహాకావ్యములు నాటకములు లఘురచనలు పెక్కులు వెలువడినవి. కాళిదాసు రఘువంశము, భోజరాజు చంపూరామాయణము, క్షేమేంద్రుని రామాయణ మంజరి మున్నగునవి కావ్యములు. దిఙ్నాగుని కుందమాల, భాసుని యజ్ఞఫలాభిషేక ప్రతిమా నాటకములు, భవభూతి ఉత్తర రామచరిత్రము, మురారి అనర్ఘ రాఘవము రాజశేఖరుని బాలరామాయణము, జయదేవుని ప్రసన్న రాఘవము, ఇవి మఱికొన్ని సంస్కృతములో రామగాథా నాటకములు. భారతవర్షమందలి ఇతర భాషలలో బహువిధ పరివర్తితములై రామాయణములు వెలయుచున్నవి. రామాయణ వాణి సర్వదేశములకు సర్వజాతులకు సర్వ వాఙ్మయములకు సమ్మశితికమైన ప్రణవ నాదము.

## తెలుగు జగము-అంతా రామ మయము

తెలుగు దేశమున తెలుగువాఙ్మయమున సీతారాములు ప్రత్యణువునందు ప్రత్యక్షరమందు ప్రకాశించు దైవ దంపతులు. రామాలయము రామభజనలు రామాయణ పారాయణములు రామనామ జపములు సర్వాంధ్రదేశ సాధారణములు. తెలుగువాని మనస్సునకు రసనకు రామాయణము తోబుట్టువు, జానకీరాములు తెలుగువారి యిలువేల్పులు. రామచంద్రుడు ఆంధ్రదేశమున సంచారముచేసెను. వసించెను. పంచవటి భద్రగిరి పంపాసరస్సు తెలుగు భూమిలోనివే కదా! ఇది యిటుండె, తెలుగులోని రామగాథాత్మకములగు కృతులను లెక్కవేయజూచుట తారకాపరిగణనము. పయిపయి లెక్కకు వచ్చిన రామాయణములే మున్నూఱు. వానిలో పేరు పొందినవి-పొందుచున్నవి వందకు క్రిందుకాదు. ఆంధ్రవాఙ్మయమున సాహిత్యశాఖ లెన్ని యవతరించినవో అన్నింట రామాయణము అల్లుకొని యున్నది.

పద్యానువాద రామాయణములు, ఉత్తరకాండము, ప్రబంధము, ఖండకావ్యము, ద్విపదకృతి, అచ్చతెనుగుకబ్బము, ద్వ్యర్థికావ్యము, నాటకము, యక్షగానము, స్త్రీలపాటలు, సలక్షణవచనము, వాడుకభాష, ఇత్యాది బహుప్రక్రియలలో తెలుగు రామాయణము తన విశ్వరూపమును ప్రదర్శించుచున్నది. సప్తకాండములతోడి రామాయణములు వచ్చినవి; షట్కాండ పర్యంతమైనవి వచ్చినవి; ఉత్తరకాండస్థమైన కథనే కైకొని వ్రాసినవారున్నారు. ఏకదేశము దీసుకొని

గ్రహించిన వారున్నారు. లేశమైన కథా ఘట్టముతో యధేష్ట కల్పనము కొందఱు చేసిరి. ఒవలురీతులుగా నున్న అయా తెలుగుకృతులకెల్ల శ్రీరామచంద్రుడే సూత్రాత్మ.

సంస్కృత వాఙ్మయమున వాల్మీకము ఆదికావ్యమెట్లో, తెనుగులో నన్నయ ఆదికవి యటులు. భారత రచనకు మున్నే ఆయన రాఘవాభ్యుదయము, అన్న కావ్యము వ్రాసెనుట. ఇది లక్షణ గ్రంథకర్తలు చెప్పినమాట. దీనిని బట్టి రామాయణ కర్తలగు తెనుగు కవులలో నన్నయపేరు ప్రథమస్మరణీయము. తిక్కన నిర్వచనోత్తర రామాయణము ప్రచారములో నున్నదే కదా! ఎఱ్ఱాప్రెగడ రామాయణములోని పని జనంద రంగరాట్ఛందము కొన్ని పద్యములు ఉదాహరించెను. చెప్పవచ్చినది. కవిత్రయము వారు భారతమునేకాక రామాయణమును గూడ తెనుగుభాషలో వ్రాసిన వారైరి. నన్నయ రాఘవాభ్యుదయము, ఎఱ్ఱన రామాయణము లభించినచో అంతకుమించి యదృష్టము లేదు.

## పద్యానువాదములు; భాస్కర రామాయణము

తెనుగున పద్యరామాయణములలో సర్వవిధ ప్రసిద్ధిచే అద్యమైనది భాస్కర రామాయణము. భాస్కరు డన్నది కవిపేరు. తిక్కన సోమయాజి తాత మంత్రి భాస్కరుడు. ఆయన మొదట రామాయణ మంతయు వ్రాసెనట. తాటాకు పొత్తముకదా! అది కొంతకాల మగుసరికి చెదలుపట్టి అయిదు వంతులు హరించిపోయెను. తరువాత భాస్కరుడన్న పేరుగలవాడే మఱియొక కవి. వారి యింటిపేరు హుళక్కి. మొదట హుళక్కి. హుళక్కిగా వ్యవహారములో మాతె నందురు. హుళక్కి యనగా తాంబూలము. ఇది కన్నడ పదము. ప్రభువునొద్ద అగ్రతాంబూల గౌరవము పొందిన కారణమున ఇంటిపేరిటులు వచ్చెనట. ఈ భాస్కరుడు సాహిణి మారని కొలువు కవి. తెనుగు భారతము వలెనే ఈ రామాయణముకూడ ఒక్కరి నిర్వహణముకాదు. హుళక్కి భాస్కరునిది గురుస్థానము. భాస్కరుని కొడుకు మల్లికార్జునభట్టు. అతని భాగము బాల కిష్కింధా సుందరకాండములు. భాస్కరుని శిష్యుడు కుమార రుద్రదేవుడు. అయోధ్యా కాండము అతనివంతు. భాస్కరుని మిత్రుడు అయ్యలార్యుడు. ఆయన యుద్ధకాండోత్తరభాగము చేసికొని వ్రాసెను. యుద్ధకాండములోని పూర్వభాగము భాస్కరుడు

తానే యుంచుకొని తేలెను. ఈ లెక్కలో అరణ్యకాండము తరవాయి. అది, అంతకు సూతేంద్రకృతము మంత్రి భాస్కరుడు వ్రాసిన రామాయణమున పోయి నదిపోగా దైషికముగా శేషించిన కాండము. వెరసి ఆఱుకాండములు, అయిదుగురు కవులు. వీరు పదమూడు పదనాల్గు శతాబ్దుల నడిమి వారు. మంత్రి భాస్కరుడు మాత్రము వీరికి నూతేండ్ల పూర్వపువాడు

భాస్కర రామాయణములో నున్నవి ఆఱువేలపై చిలుకు గద్యపద్యములు. చంపూపద్ధతి. భాస్కరము వాల్మీకమునకు మక్కికి మక్కి పరివర్తనము కాదు. కొంత స్వతంత్రమైనది. మూల కథలో ఎక్కువమార్పు జరుగలేదు. అన్య రామాయణములలోని కొన్ని కథలు క్రొత్తవి గ్రహింప బడినవి రావణుని శక్తిచే లక్ష్మణుడు మూర్ఛిలినపుడు హనుమంతుడు సంజీవనిని తెచ్చును. ఆ సందర్భమున 'కాలనేమి వృత్తాంతము' అవాల్మీకము భాస్కరములో వ్రాయబడెను. ఇట్టివే కొన్ని పేర్పులు మార్పులు, వాలిభార్య తార రాముని శపించుట, రావణుడు పాతాళహోమము చేయుట. సేతు బంధ సమయమున విఘ్నేశ స్తోత్రము మొదగునవి.

భాస్కర రామాయణములోని కవిత్వశైలి ప్రౌఢముగానుండియు, పురాణ శయ్యా పరిపాకము కారణముగా సర్వసుబోధ మనిపించును, ఆబాల గోపాలము పరిచితమైనది; తెలుగువారిలో భాస్కరరామాయణములోని పద్యములు చాలా మందికి కంఠస్థములు. అంత్యాను ప్రాసముపై ప్రీతిగల రచన కొంతయున్నది.

రామ శతాభిరామ రఘురామ యశోధనకామ దోర్బలో
ద్దామ యనేకనామ నృపతారకసోమ సమగ్ర శౌర్య సు
త్రామ పటు ప్రతాప బలధామ వినిర్జితకామ సద్గుణ
స్తోమ। తపోవనస్థలుల, జూడగరమ్మిటు మాకు వింధవై.

సీతారాముల దాంపత్య ధర్మమునుగూర్చి హనుమంతుడను కొనుచున్నాడు.

ఈ రామ మనం బెప్పుడు
నారామునియంద యుండు; నారాము మనం
బీరామ యంద యుండును;
ఘోరవ్యసనము లిరువురకు సమానంబుల్

రామాంగుళీయకమును అందుకొన్న జానకి యంతరంగ స్పందము:

ప్రాణిగ నిడగ్రీవేయక
మై తోఁచెను నాకు; నాదు ప్రాణేశునకున్
జేరం బెట్టఁగఁ గంకణ
మైతో! కేయూర మైతో! యచ్చటఁ జెపుమా!

లక్ష్మణుడు మూర్ఛితుడైనాడు. సంజీవనిని తెచ్చి బ్రతికించవలెను. ఆ కార్యము హనుమంతున కొక్కనికే సాధ్యము. రాము డతనితో అన్నమాట:

సోదరుల మేము నలువుర
మైదవ తోడవుదు నీవు నన యముఁ జేతో
మోదంబు మిగులఁ గలుగన్
నాదెసఁ గృపసేయు మయ్య నగచరవర్యా!

అచ్చమైన తెనుగువాని నోట వచ్చెడి మాట యిది. భరతుడు కైకను గర్హించిన పద్యము:

అడవుల రామచంద్రుఁడు జటాజినముల్ ధరియించి యుండ నేఁ
బుడమి భరించి భోగములు పొందఁ గలానటె' యిట్టి చొప్పులె
య్యెడఁ గల? వింక నన్ను మగమేమి తెలంపుచుఁ జూతుఁ బాపపుం
గడుపునఁ బుట్టి యీ భువన గర్హకుఁ బాతుఁడనైతి రాక్షసీ!

ఇపుడు తెలుగునేల పల్లెలలో భాస్కరరామాయణము పురాణముగా వినుచు సంప్రదాయము చెడిపోలేదు. సంస్కృత పండితులైచో వాల్మీకము చెప్పుదురు. అది క్వాచిత్కము. ఎక్కువ చోట్ల భాస్కర రామాయణమే పది మందిని కూర్చుండ బెట్టుకొని పురాణముచెప్పట యున్నది. ఒక విధముగా జూచినచో తెలుగు భారతమున కున్నంత వ్యాప్తి 'భాస్కరము'నకు కలదు. ఉపలబ్ధిని బట్టియు ఉజ్జ్వలతను బట్టియు సమగ్రతను బట్టియు భాస్కర రామాయణము తెనుగున సమానకృతులలో ఉత్తమ శ్లోకమై యున్నది.

8

## మొల్ల రామాయణము

మొల్ల కవయిత్రి. పదునాఱవ శతాబ్ది. ఈమె రామాయణమునకు మొల్ల రామాయణమని ఖ్యాతి వచ్చినది. స్త్రీలలో నింతచక్కని కవిత్వము వ్రాయగలిగి గ్రంథరచన చేసినవారిలో మొల్లపేరు మొట్టమొదట వినవచ్చును. ఈమె తండ్రి ఆతుకూరి కేసనసెట్టి. గురులింగ జంగమార్చనపరుడు. శివభక్తుడు. మొల్ల కుమ్మరి వంగడములో పుట్టినదని జనశ్రుతి. శ్రీకంఠమల్లేశుని వరముతో ఈమెకు తెలుగుకైత లభించినది. ఈ మల్లేశుడు గోపవరపు వేల్పు. గోపవరము నెల్లూరి మండలములోనిది. మల్లేశుని అనుగ్రహముతో జన్మించిన యీమె అసలు పేరు మల్లమ్మ యనియు, మెల్లమెల్ల తెలుగునోళ్లలో "మొల్ల"గా మారెననియు చెప్పు కొందరు. ఈమె కాలమును గూర్చి విభిన్నాభిప్రాయములు కలవు. కాని ఈమె శ్రీనాథయుగాంతమునకు చెందినదనియే పలువురి అభిప్రాయము. కాలమునకేమి! తన రామాయణముతో మొల్ల ఎల్లకాలము నిలబడగల కవయిత్రి. ఆమె తొలిపుట్టువులలో ఎంతో పుణ్యము చేసికొన్నది. దాని ఫలముగా శివుననుగ్రహించినాడు. రామభక్తి యేర్పడినది. శివార్చనపరుడైన తండ్రి కేసన అంశ మామెలోనున్నది 'కన్యా పితృముఖీ ధన్యా' కావ్యప్రక్రియలు నిఘంటు క్రియలు ఆమె ఎఱుగదట. మల్లేశుని వరము ఉన్నది. కదా! రామాయణము వ్రాయుటకు కవిత్వము ఉదయించినది. పోతనగారి పోలిక, "పలికెడిది భాగవతమట! పలికించెడువాఁడు రామభద్రుండట" అను పద్యము వంటిదే మొల్లయు వ్రాసినది:

చెప్పు మని రామభద్రుడు
చెప్పించిన పల్కుమీఁదఁ జెప్పెద నేనై
యెప్పుడు నిహపర సాధన
మిప్పుణ్య చరిత్రఁ దప్పు లెంచకుఁ డెందున్.

మొల్ల తెలుగుకైతకు కొన్ని యెల్లలు ఏర్పఱచినది. అతిగూఢ శబ్దములకు ఆమె ఇష్టపడదు. అతిగూఢము లనగా నిఘంటువు చూచుకోవలసినవేమో!

వలిపెపు సన్నపయ్యెదలొ వాసన గందపుఁబూఁత మేనిపైఁ
గొలఁదిగఁ గానుపింప వలిగుబ్బచనుంగవ ఠీవి మెప్పుఁగాఁ
దెలుఁగని చెప్పమెప్పుఁగదు ఠీటగు మాటలఁ గ్రొత్త రీతులన్
వొలుపు వహింపకున్న మఱి పొందగునే యతిగూఢశబ్దముల్.

"తేనె సోక నోరు తియ్యనగురీతి తోడనర్థమెల్లఁ దోఁపవలయునఁట" ;
"గూఢశబ్దములతో కొట్లాడుపని మూఁగచెవిటివాని ముచ్చటయఁట ;"

ఏదో పరాధీనయై వ్రాసికొనిపోవుటకాక, కవిత్వమెట్లున్నచో విబుధులకు రుచించునో మొల్ల తెల్లముచేసినది. తొల్లిటి ఇప్పటి సత్కవులను మొల్ల తన రామాయణములో కొలిచినది. ద్విపద రామాయణకర్తయగు రంగనాథు నీమె పేర్కొన్నది. ఇదివఱకే భాస్కర, రంగనాథాదులు రామాయణమును వ్రాసిరి కదా ; తాను మరల వ్రాయుటయేల ? దీనికి మొల్ల యిట్లు సమాధానపడినది.

రాజితకీర్తియైన రఘురామచరిత్రము మున్ గవీశ్వరుల్
తేజ మెలర్పఁ జెప్పిరని తెల్పియుఁ గ్రమ్మఱఁ జెప్పనేలనన్,
భూజన కల్పకం బగుచు భుక్తికి ముక్తికి మూలమైన యా
రాజును దైవమైన రఘురాము నుతించినఁ దప్పుకల్గునే ;

మఱియొక చక్కనిమాట: "రాముని పేరుతో రాచిలుకను పిలిచిన వెలయాలికే ముక్తిలభింపగా, నేర్పుతో రాముని వినుతించినవారికి ముక్తిరాదా !" అన్నది, రాముని యనుగ్రహము పొందుటకు భక్తివలయునే కాని, చదువుకాదు

నేరిచి పొగడినవారిని
నేరక కొనియాడువారి నిజకృప మనుపం
గారణ మగుటకు భక్తియె
కారణ మగుఁగాని చదువు కారణమగునే !

ఓహో ; ఈయొక్క పద్యము చాలు, మొల్ల హృదయము గ్రహించుటకు, ఆమె కల్పనములు చాల సుకుమారములు. గుహుఁడు గంగను దాటించునపుడు

శ్రీరాముని పాదములు కడుగును. రాముడు నావనెక్కినచో నావ నాతిగా మాఱు వని అతని యనుమానము. అతనికి అహల్యా వృత్తాంతము తెలియునుగదా ఆ సందేహముతో కాళ్ళు కడుగుచున్నాడట: ధూళిపోవుటకు.

సుడిగొని రాముపాదములు సోఁకిన ధూళివహించి రాయియే
ర్పడ నొకకాంత యయ్యెనఁట పన్నుగ నీతని పాదరేణు వి
య్యెడ వడి నోడ సోక నిది యేమగునో యని సంశయాత్ముఁడై
కడిగె గుహుండు రామపద కంజయుగంబు భయంబు పెంపునన్;

రసార్ద్రమైన పల్కుబడికి "అశోకవనములో జానకి" ఉదాహరణము.

సీ. పతిఁబాసివట్టి యాపదకంటెఁ బలుమాఱు
వివిధ మాయలచేత వేఁగి వేఁగి
పీర దానవకోటి వికృతవేషంబులు
కనుఁగొని చిత్తంబు క్రాఁగిక్రాఁగి
తనదిక్కు లేమికై తల్లడిల్లుచు నాత్మ
లోపల మిక్కిలి లోఁగి లోఁగి
కర్కశకోరంబుగా నాడు మాటలఁ
దొరఁగెడు కన్నీట దోఁగి తోఁగి

రాముఁ దలచుకొంచు రామునిఁ బేర్కొంచు
రామ! రామ! యనుచు రమణి వలుక
కపివరుండు చూచి కామినీ రత్నంబు
సీతయనుచుఁ బొంగెఁ జిత్తమందు.

సీ. నిడుదపెన్నెఱివేణి జడలుగా సవరించి
మలిన జీర్ణాంబరం బొలియఁగట్టి
కాషాయరజంబు విభూతి పూఁతఁగ బూసి
తన దివ్యమూర్తిది త్తమున నిలిపి

నిరశన స్థితితోడ నిలిచి భూశయ్యను
బవళించి నిదుర యేర్పడఁగ విడిచి
తారక బ్రహ్మమంత్రంబుఁ బఠించుచుఁ
గణన రాక్షస దుర్మృగములలోన

అహిత లంకామహాద్వీప గహనసీమ
తపము సేయుచునున్నాను దన్నుఁగూర్చి
నాకుఁ బ్రత్యక్షమగుమని నాథునకును
విన్నవింపుము సత్త్వసంపన్న! నీవు.

## రఘునాథ రామాయణము; మఱికొన్ని. . . .

రఘునాథుడు తంజావూరు నాయకరాజు 17వ శతాబ్ది. ఈయన రాయల వలె పేరుపొందినవాడు. గొప్పవీరుడు; కవిరాజు. సంగీత సాహిత్యకళానిధి. విజయవిలాసాదికృతులు స్వీకరించిన రసజ్ఞుడు. వాల్మీకి చరిత్రాదులగు బహు కావ్యములు రచించెను. ఆయన కృతులలో రఘునాథ రామాయణ మొకటి. బాలకాండములోని కొంత కథ మూడు నాల్గు ఆశ్వాసములకు పరిమితమైనవి ఉపలబ్ధము. దక్షిణాంధ్రయుగమునందలి తెలుగుకైత సౌకుమార్య సౌరస్యములకు ఈ రామాయణ రచనారీతి ఒక అభిరామోదహరణము.

ఋష్యశృంగునికడ వేశ్యల శృంగారము; అనయన ఘట్టము.

తళుకు బంగరు వ్రాఁత వలిప చేలలు వన్నె
సవతేరుపకఁ జాల హవణు మించఁ
గాసెల తీరుగాఁ గట్టి యాపై నల్ల
పట్టుదట్టుల లీలఁ బరగ జడలు
నడుములఁ జుట్టి యందముగాఁగ నందుపై
బలుకెంపు మొలనూళ్ల పరిఢవించి
రవికెలు మురువులు రాణిక యుండ బిగియించి
ముత్తేల జన్నిదంబులు ఘటించి

మేలిచందురు కావికమాలులొక్క
వింతగా నాల్గు చుంగులు వెదలం గట్టి
యొదలు నిండంగ బల్లుగంధ వొడులు చల్లి
పల్లవాధర లెల్ల సంభ్రమము మెరయ......

వనజ విలోచనల్ మెఱుంగు వాలిక చూపులు గ్రేళ్లనాఁట న
మ్మునిసుతుసారెఁ గనొనుచు ముద్దుల వేడుక జింక చిక్కెఁబో
యనుచు లసద్విలాస పరిహాసవచః క్రమముల్ సెలంగఁగాఁ
జని రట సాగి యంగ నృపచంద్రుని పట్టణ పద్ధతిం దగన్.

విద్వత్కవి కర్ణరసాయన సకల వర్ణనాపూర్ణ రామాయణము అన్న పేరితో చిత్రకవి వేంకటరమణకవి (18శ.) గ్రంథ మొకటి వినబడుచున్నది. గ్రంథ నామమును బట్టి వర్ణనాదికమున చమత్కృతులు ఏవో చేసియుండును. మానూరి గోపాలరాయకవి యథావాల్మీక రామాయణము - కాణాదము పెద్దన సోమయాజి సూత్రదారుడుగా సాగిన యథాశ్లోక తాత్పర్య రామాయణము-వార ణాసి లక్ష్మీపతి రచించిన రామాయణము- వీనినిగూర్చి వినుకలి. కొన్ని ముద్రితములు; అసమగ్రములు. ఈ నడిమికాలము పెక్కు రామాయణములను కడుపున పెట్టుకొనియే యుండవచ్చును. "వృక్షైర్వృక్షోలభ్యతే"

## గోపీనాథరామాయణము

భాస్కరరామాయణము మొల్లరామాయణము తరువాత గోపీనాథ రామాయణము తెలుగునాట ప్రచార ప్రశస్తులు పొందినది. గోపీనాథము వేంకట కవిది నెల్లూరిమండలము కావలితాలూకలోని లక్ష్మీపురము. అభిజనము 19వ శతాబ్ది. ఈయన సంస్కృతాంధ్రములలో సమర్థుడైన విద్వాంసుడు. శాస్త్రవైదుష్యము కలవాడు. మాఘుని శిశుపాలవధము తెనుగున పరివర్తనముచేయుట అల్పముకాదు భగవద్గీతాశాస్త్రము పద్యములో వ్రాసెను. వేంకటగిరి సంస్థాన కవిగా ప్రసిద్ధి పొందెను. రామాయణము షట్కాండకథా ప్రపంచమంతయు సమగ్రముగా పద్య గద్యములలో నడునడించెను. గృహనామముతో గోపీనాథరామాయణముగా పేర్వ

దసినవి. ఈరామాయణము గోపీనాథాంకితము; అనగా శ్రీకృష్ణాంకితము. వేంకటగిరి సంస్థానప్రభువు సర్వజ్ఞకుమార యాచేంద్ర మహీపాలుడు ఈ రామాయణమును ఆమతించి ప్రచారములోనికి తెచ్చెను. వెంకటకవి తన కవిత్వోదయమును గూర్చి రామాయణావతారికలో చెప్పకొనెను. తాను పదునాలేండ్లవయస్సులో ఉండగా ఒకనాడు సింహపురమునుండి నృసింహదేవుని కల్యాణోత్సవమును చూచుటకు వేదగిరికి వెళ్ళెను. అక్కడ ఒక మహాయోగి వలన ఒక విద్యను పొందెను. ఆ విద్యాప్రసాదమున కవిత్వము చెప్పశక్తి లభించెనట! గోపీనాథరామాయణములోని కవిత్వము పరిపాకప్రౌఢము. సలక్షణ మధురము భాస్కరాదులు వ్రాసినదే మరల ఎందుకు వ్రాయవలెనన్న సంశయము అందరికి వలెనే వెంకటకవిని కలిగినది. ఎవరు చెప్పకొన్నను దానికి ఒకటే జవాబు.

"మున్నల భాస్కరాది కవిముఖ్యులు ప్రీతి రచించి రీకథన్
జెన్నుగ నీవు క్రమ్మఱ రచించుట కెయ్యది హేతు వంచు మీ
రన్న బుధేంద్రులార! వినుఁడా! రఘునాథ చరిత్ర మెందఱె
లెన్నిన నన్నిరూపుల కహీనగతిం దగియుండు నుర్వరన్."

వేంకటకవి తొంటి ప్రబంధములలోని పద్యములను గొన్నిటిని ప్రసిద్ధశైలీకములను అనుకరించుచు వ్రాసెను. ఈయనుకరణము ఒక ముచ్చటకు చేసెను. ఆయనకొక ప్రత్యేకమైన ప్రౌఢమైన కవిత్వశైలీ మార్గము కలదు. "అటజనికాంచె భూమిసురు"డన్న ఓజస్వంతమైన పెద్దనగారి పద్యము వంటి పద్యము గోపీనాథరామాయణములోనిది చూడగలరు.

"అటుఁజని కాంచె రామవిభుఁ డంబరచుంబి రసాల భూర్జరీ
కుటజ తమాల తాల వట కుంద కురంటక కోవిదార వి
స్ఫుట కరవీర లోధ్ర తరు చూత మధూక విశాల శింశుపా
పటల విరాజితం బయిన భాస్కరధామము భూరిధామమున్."

మరియొకటి. సీత, శింశుపావృక్షము మీదనున్న ఆంజనేయుని చూచెనా? అయ్యో! స్వప్నములో వానరాకారము కనఁబడెను? అని దిగులుపడెను. తానునిద్రయే పట్టుటలేదు. నిద్రలేని కలవచ్చునా? అని అబ్బురపడెను. అప్పుడు తనకొను చున్నది

"కఁయో వైష్ణవమాయయో? హృదయ వైకల్యోత్థమో నిక్కమో
తెలియన్నేఁటికి యున్నదాననొ ధరిత్రీ పుత్రినో, కాన్నా కే
వలభక్తిన్ భవగుంఢు న్నాధవిభునిన్ వర్ణించుచున్ ధీశము
జ్జ్వలు డై యుండుటకేమి హేతువు మహైశ్వర్యంబు చింతింపగన్"

ఈ పద్యములో అచ్చముగా వెంకనకవి పోతనకవి! "గోపీనాథము"న ఆశ్వాసాంతమందు చిత్ర బంధములతో నున్న పద్యములు కవి విచక్షణతకు తార్కాణములు. అరణ్యకాండములో రాముఁడు సీతాన్వేషణము చేయుచున్నపుడు నానావిధచిత్రవృత్త రచనసాగినది. అచ్చటి వృత్తౌచితి కవి ప్రతిభా సదర్శనము. ప్రసన్నమము రసానుగుణమునగు బంధ సౌందర్యమునకు రెండు పద్యములు.

పిన్నట నాఁట నుండియును బెక్కుసుఖంబుల వర్ధమానమై
పన్నియ గన్నదౌట నిటువంటి యవస్థల కోర్వలేక యా
పన్నత నొందియున్నది నృపాలక! జానకి; కంటె భక్తి సం
పన్నతయున్ శుచిత్వ మసమాన సతీత్వము మాకుఁ దెల్పెడిన్.

సరవర! సద్మ సౌఖ్యము మనంబున నెంచక యీ వధూటి దు
ర్భర వనవాస సంజనిత బాధఁ దలంపక భర్తృభక్తి చే
వరుస నరణ్యసీమ కిటు వచ్చుటఁ జేసి యపాంసులా శిరో
వర మణి యయ్యెఁగాదె తనవారికి నిత్య యశంబు గల్గగన్.

ఈ రామాయణముతో గోపీనాథవంశమునకు వెంకటకవి నిత్యయశస్సును చేకూర్చినవాడయ్యెను. ఆంధ్ర సారస్వతి నాసాగ్రమున అణిముత్తెము కై సేసినవాడయ్యెను.

## ఆంధ్రవాల్మీకి రామాయణము :

వావిలికొలను సుబ్బారావుగారి ఆంధ్రవాల్మీకి రామాయణము కొన్ని విశేషములతో పేర్వడసిన గ్రంథము. ఉత్తరకాండముతో సహా ఏడుకాండములు అనువాదముచేసిరి. మూలమునకు విధేయమైన రచన. కాని, భక్తివిశేషముచే

సహజ స్వతంత్రమైన యొక తెలుగు నుడికారము వీరియందు పొందుపడి యున్నది. పారాయణ గ్రంథముగా దీనిని చేయవలెనని కవి తలపెట్టినట్టు లున్నది. వాల్మీకములోని గాయత్రీ మంత్రబీజాక్షరముల సన్నివేశమువంటిది ఈ తెనుగు రామాయణమున సుందరకాండములో సుబ్బారావుగారు నిక్షేపించి చూపిరి. ఇంతకు మున్నుగల భాస్కరరామాయణాదులు గద్యపద్యమయములై యుండగా నిర్వచనముచేయుట విశేషము. ఈ రామాయణము ఒంటిమిట్ట కోదండరామస్వామికి అంకితమైనది. వావిలికొలనువారి రామభక్తి ఆంధ్రజగత్తున ప్రసిద్ధమైనది. ఎందరో భక్తశిష్యులను తీర్చిన ఆచార్య పీఠము ఆయనది. వావిలికొలను సుబ్బారావుగారికి వాసుదాసు అనియే వ్యవహారము. "భక్తి సంజీవని" వీరి పత్రిక పెక్కేండ్లు సత్ప్రచారము సలిపినది. కోదండరామస్వామి ఆలయ పునరుద్ధరణమునకు వాసుదాసుగారి కృషి స్మరణీయము. కడపకును నందలూరునకును నడమనున్న పల్లె ఒంటిమిట్ట. కోదండరామస్వామికి నెలవు. పోతనగారియెడల వాసుదాసుగారి గౌరవము ఇంతింత అనరానిది. నరకృతుల నీయకపోవుట భక్తిపారవశ్యము పోతననుండి నేర్చెను రామాయణమురచించుటకు తగిన అవకాశము వాసుదాసుగారికి జన్మాంతర సుకృతముగా లభించినవి. రామాయణ పీఠికలోనిది :

కనులకుఁ గలఁకఁ జెందు గరళంబు మదికినై
తపియింపఁజేయు విత్తమ్ము లేదు
కాళ్ళబందా లుర్విరాళ్ళు కుత్తుకకునౌ
బిడ్డల జంజాట మడ్డులేదు
మంచి సెబ్బెర లెద స్మరియింపనీయని
యంతటి భోగంబు లమరలేదు
ఈ పూట హరిహరీ! యేపాట గడచునన్
దారిద్ర్యభీతి యింతయునులేదు

రాముఁ దలఁపఁజేయు నామయం బింతంగ
సౌఖ్య మరయుపొందె కాయయుండ

సీతపలను గలుగ నిప్పుడ శ్రీరాముఁ
దలఁపకున్న నెపుడు దలఁచువాఁడ।

సుబ్బారావుగారి అభిజనము కడప మోచముపేట. తలిదండ్రులు కనకాంబా రామచంద్రులు. జననము 1863- నిర్యాణము 1939. సతీహితచర్య-ఆర్య కథానిధి అన్న వీరి పుస్తకములు బాలబాలికలలో పాఠ్యములై ప్రచారమునకు వచ్చినవి. కృష్ణలీలామృతము, కౌసల్యాపరిణయము, హనుమంతచరిత్రము మున్నగు వీరి గ్రంథములు పేరుగడించినవి. వారి సర్వగ్రంధము లొకయెత్తు; ఆంధ్రవాల్మీకి రామాయణమొకయెత్తు. ఈ రామాయణమునకు "మందర"మను వ్యాఖ్యానము వీరే వ్రాసిరి. విశిష్టాద్వైత సంప్రదాయములోనివారు. ఈవ్యాఖ్యలో పెక్కు విశేషములు వెల్లడిచేసిరి. యథాతథమైన శ్లోకానువాదమునకు ఒకమచ్చు.

ఇయం సీతా మమసుతా సహధర్మచరీ తవ
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా

క. ఈ సీత నాదు కూతుఁరు
నీ సహధర్మచరి దీనినిం గైకొనుమా
భాసుర శుభమగు నీకును
గౌసల్యాసుత! గ్రహింప కరమునఁగరమున్

యథామూల పద్యానువాదములలో వావిలికొలనువారి ఆంధ్రవాల్మీకిరామాయణము భక్తిశక్తి బంధురమైన కవిత్వశైలిచే నొక విశిష్టమైన స్థానము నలంకరించి యున్నది.

## శ్రీకృష్ణ రామాయణము

శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు మహామహోపాధ్యాయులు, కవి సార్వభౌములు, ఆంధ్రాస్థానకవి పదమునలంకరించినవారు, కళా ప్రపూర్ణులు, రాష్ట్రపతి సత్కృతి నందినవారు. 19, 20 శతాబ్దుల నడిమికాలమున తెనుగులో అనంతమైన రచన చేసినవారు. వారి గ్రంథములు రెండువందలయేబదివరకు ఉన్నవి.

అవి యెల్ల ఒక యెత్తు; వారు తెనుగున రచించిన భారత భాగవతరామాయణము లొక యెత్తు. మొత్తము నూఱువేలపద్యములకు మీఱియుండును. శ్రీపాదవారిది వజ్రసంకల్పము. కనకాభిషేకము, గండపెండేరము, గజారోహణము మున్నగు గౌరవములు వారు పొందనివిలేవు అవధానము సేసిరి. ఆపవు చెప్పిరి; గౌతమి, వజ్రాయుధము, మానవసేవ, వందేమాతరం అను పత్రికలకు సంపాదకత్వము నిర్వహించిరి; శ్రౌతము నెఱిగిన వారు; ఉపాసన ప్రవణులు. వారి నివాసము రాజమహేంద్రపురము. తొంబది నాలుగేండ్లు ఆరోగ్యభాగ్యముతో పూర్ణపురుషాయుషము పొందినవారు.

శ్రీకృష్ణరామాయణము. ఇది వాల్మీకమునకు యథామూలానువాదము కాదు; కథలో చాల స్వతంత్రత ఉన్నది. తనకు ముందు ఆధ్యాత్మము, వాసిష్ఠము మొదలగు సంస్కృత రామాయణములు, భాస్కర రంగనాథాది రామాయణములు ఏన్నో వందలకొలది ఉన్నవి. శాస్త్రిగారు ఆయాకృతులలోని చిత్రములగు కథాఘట్టములు ఏఱుకొని మధుర్రవతముగా రామగాథను సంతరించిరి. శ్రీపాదకృష్ణకృతిమైన శ్రీకృష్ణరామాయణము' అను నామము పరమోచితముగా నున్నది. ఇది సర్వరామాయణ సారమంట: "అన్నిటిలోని చిత్రముల నన్నియు నొక్కటిగాఁగఁ జేర్చుచున్ విన్ననవొప్ప రామకథ వీనుల విందగునట్లుచేసి" మన్ననగాంచిన కృష్ణమూర్తిశాస్త్రిగారు తమ రామాయణమును గూర్చి వ్రాసికొన్న సీసము:

అది కవీంద్రరామాయణార్థము గల
　　దయ్యు శ్రీకృష్ణరామాయణంబు
సకలార్థముల నెప్డు సమకూర్చుటయకాక
　　కొన్ని విశేషము లెన్ని తెలుపు
రావణాసురు దోషరాహిత్యముం జెప్పుఁ;
　　గైకతప్పులులేమి వాకొను నొగి;
సతి యహల్య యటంచుఁ జాటించు; ననసూయ
　　యంగరాగ మహత్త్వ మనువదించు

రజక వాగ్గత రఘురామవృజిన మడఁచు
శంబుక వధంబు గానట్టిచక్కిఁ జూపు

నెందు నెందును గుణముల నేరి చెప్పఁ
గృష్ణరామాయణం బిది కీర్తితంబు.

ప్రధానముగ కథలో ఆయనచేసిన మార్పులేవియో యీ పద్యము నిర్వ చించుచున్నది. ఉత్తరకాండ కథకూడ ఈ రామాయణమున సందర్భోచితముగ నన్నివిష్టముచేసిరి. రావణుడు–కైక–మంధర–మున్నగు పాత్రల యాథార్థ మును ఆధ్యాత్మికదృష్టితో అన్వయించుచు చెప్పిరి. శ్రీకృష్ణరామాయణము వాల్మీకి చరిత్రముతో ఆరంభమగును. రామరాజ్య ప్రశంసతో శోభనాంత మగును. సీతాపరిత్యాగము కథలో మార్పు చిత్రమైనది. శాస్త్రులుగారు దేశ కాలములు గుర్తించిన ఔచిత్యవేత్త. సీతాదేవిపై అభాండమునుమేపిన చాకలి వానిని పిలిపించి పెద్దలు విచారణము చేయుదురు. దానిలో, ఆచాకలి పిచ్చి వాడని తెలిసినది. ఉన్మత్తునకు శిక్ష ఉండదు. వాని మాటకు విలువ ఉండదు కదా ! వసిష్ఠాది ఋషులు జానకి పావనశీల యని చెప్పుదురు రాముడు ఋషి వాక్యానుసారము చేసెను. ఇట్టిదే శంబుకవధ ఘట్టములో మార్పు. శంబుకుడు ఘోరమైన తపస్సుచేయుచున్నాఁడు. అట్టి తపస్సు ఎవ్వరును చేయలేదు. చేయరాని తపస్సుచేయుచున్న శంబుకునకు శిక్ష–ఆతపస్సునకు విఘ్నము చేయుటయే. రాముడు శంబుకుని వధించినట్లు శ్రీకృష్ణరామాయణము చెప్ప లేదు. శంబుకవధ చెప్పుట జాతిద్వేష హేతువగునుగదా ? కాలానుగుణమైన యిట్టి మార్పులు 'ఎన్నో శాస్త్రిగారు ఈ రాయయణములో నేర్పుమీఱచేసిరి. శ్రీపాదవారి కవిత్వము ప్రసాదమధురము; ప్రవాహ మోహనము; ప్రజ్ఞాప్రకాశ కము. శ్రీకృష్ణరామాయణము అక్షరబ్రహ్మము. బాలకాండములో సీతాలావణ్య మును గూర్చి వర్ణించిన యీ గీతము తెలుగులిపికి అక్షర జ్ఞాపిన.

జానువుల 'శ్రీ'ల్ - పిఱుందుల 'దా'- , నడుమున
నుదుటఁ గ్రార- పొక్కిటిలోన బొట్టు-
రమణి బుధు లెంతు రక్షర బ్రహ్మముగను

## శ్రీరామ కథామృతము

తాడేపల్లి వేంకటప్పయ శాస్త్రిగారు రచించిన బహుకృతులలో శ్రీరామ కథామృతము పేరు వడసినది. వేంకటప్పయ్య శాస్త్రిగారి అభిజనము చంద

వోలు జననము - 68 ; నిర్యాణము 1984. తలిదండ్రులు లక్ష్మి హనుమ చ్ఛాస్త్రులు. వీరియితర కృతులు కాకాని మల్లీశ్వర మాహాత్మ్యము, శ్రీశంకర విజయ కథాసార సంగ్రహస్తోత్రము, తుకారామచరిత్రము, హరిగాథలుమున్నగు నవి; శ్రీశైల తీర్థసారమను పేర ముప్పదియారు అధ్యాయముల సంస్కృత కావ్య మొకటి

శ్రీరామకథామృతము మహాగ్రంథము రెండు సంపుటములుగా అచ్చ యినది. వెంకటప్పయ్యశాస్త్రిగారు 'మైథిలీపరిణయము" అను పేర ఆరు ఆశ్వాస ముల కావ్యము తొలుతవ్రాసిరి. తరువాత రామాయణమంతయు వ్రాయవలె నని తలపెట్టిరి. ఆక థరచన ప్రబంధక్లిష్టముగ సాగినది. సుందరకాండము మొదలు సులభశైలి పాటింపబడినది. వారే శైలిమార్పునకు హేతువు పద్యములోచెప్పు కొనిరి.

నేటి పడినపాట్లు పాటరి పోకుండ
నందఱకును దెలియనైన బాస
గీలెఱింగి రామకీర్తన మొనరింతు
నవసరంబు సుకృతమంద జేయ

సుందరకాండాది.

శాస్త్రిగారు గొప్పవిద్వాంసులు; సాహిత్యవేత్తలు; మృత్యుంజయ పాదుకో పాసనా పవణచిత్తులు. శ్రీరామకథామృతము పార్వతీదేవికి పరమశివుడువినిపించు నటులువ్రాయబడెను. శివునకే అంకితము. రామగాథ వినిపింపుమని కోరగా పార్వతికి శివుడన్నమాట యిది:

గుణవతీమణి! నీక చేకూరెగాక
పుట్టుసంద్రమ్ము దాటింపఁబోలు నౌక
మెల్లయుగములఁ బోకార్పు దెట్లు వీఁక
రామహృదయ రహస్యార్థ రమ్యటీక,

వస్తుతః. ఈకథామృత కావ్యము రామహృదయ రహస్యముల నెన్నిటినో పకాశింపజేయుచున్నది. గాయత్రీ వర్ణాను సంధానముతో అలరారుచున్నది. వెంకటప్పయ్య శాస్త్రిగారి మనోజ్ఞ కవితాశయ్యకు మచ్చు:

మొలక నవ్వుల తోడి ముద్దుపల్కుల బాట
నెగడునట్టేటి వెన్నెలలు గాయ
గతి వేచి వెనుకొన్న క్షామాంధకారమ్ము
వడువున వేసవి వలను మీఱ
నెదిరి ః స్తుతులపై నెగయు చూపుల పేరి
మరునారి లేంట్ల సమ్మర్ద మొదవ
సంచతేజీ దొర యన్ను మిన్నకు మెచ్చు
దెచ్చుయానము వింతతెఱుఁగు సూప

అడుగడుగునం బొదము నరుణాబ్జకాంతు
లవని కెందమ్మి పూజలై యందగింపఁ
జెలియుఁ దానును నక్కోనసీమ నిండు
విహరణం బొనరించు నవ్వేళయందు.

ఉత్తర కాండము ౧ ఆ.

శ్రీరామ కథామృతము ఉత్తరకాండము రచనలోనుండగా వెంకటప్పయ్య శాస్త్రి దివంగతులైరి. వారికుమారులు రాఘవనారాయణశాస్త్రిగారు తండ్రికి దీటైన పండితకవులు. వారి పూరణముతో ఈగ్రంథము వెలయుచున్నది. భట్టబాణునిచే ఆరంభింపబడి అతని పుత్రునిచే పూరింపబడిన "కాదంబరి" ముచ్చట తలపునకు వచ్చుచున్నది. రాఘవనారాయణశాస్త్రిగారు ముమ్మూర్తుల జనకాయితులు. శ్రీదత్తభాగవతాది గ్రంథకర్తలు. శ్రీరామకథామృతము పితాపుత్రకవి ప్రణీతమైన మహాకావ్యము.

## ఆంధ్ర శ్రీమద్వాల్మీకి రామాయణము

జనమంచి శేషాద్రిశర్మగారిది. శర్మగారి జన్మస్థానము నెల్లూరుమండలములోని కలువాయపురము. నివసించినది కడప. జననము 1882 సం. నిర్యాణము 1950. జ్యోతిశ్శాస్త్రము ఆగమ గణితశాస్త్రము వ్యాకరణము యోగ సాంఖ్యాది వేదాంతశాస్త్రము గురుముఖమున చదివినవారు. తెలుగుకవిత్వము

సహజాతము. మంత్రశాస్త్రమున పాదుకాంతదీక్ష గొన్నవారు. లలితారాధకులు. ఈ శతాబ్దికవులలో పురాణవాఙ్మయము నింత తెలుగునకు తెచ్చినవారిలో వీరి పేరు మున్మొదటిది. బ్రహ్మపురాణము బ్రహ్మాండపురాణము, స్కాందాంతర్గత కౌమారికాఖండము, కేదారారుణాచల ఖండము లు. ఇట్టివి అనేకములు. వీరి తెనుగు పద్యములసంఖ్య లక్షకు మించినది. కవిసార్వభౌమ-అపూర్వ-అభినవాంధ్ర వాల్మీకి-ఆంధ్రవ్యాస - ప్రభృతి బిరుదములు వీరినారాధించుకొన్నవి.

శర్మగారి "అభినవాంధ్రవాల్మీకి రామాయణము" నిర్వచనము. మూలమున గలెనే ఇరువదినాల్గువేల పద్యములు. పై చిలుకు పద్యములు కూడ కలవు. ఈ రామాయణము తమ ముప్పదియైదవయేట మొదలుపెట్టి మూడేండ్ల పది మాసములకు ముగించిరట. మఱి యొక విశేషము: ఈ రామాయణము ముగించిన ఉత్తరక్షణమున ఆరంభించి తొమ్మిది నాళ్ళలో "హనుమద్విజయము" అను కావ్యము వ్రాసిరట. రామావతార తత్త్వము వచనము 10 భాగములు - సంగ్రహరామాయణము - సీతా స్వయంవరము - రచించిరి. అంతటి మహా కవిత్వ దీక్ష శర్మగారిది

"ఉన్నకవులలోనఁ జన్నకవులలోన  
విన్నికృతులు వ్రాయఁగన్న రెవరు?  
రాముఁ దల్ల పోతరాజునకుం బోలెఁ  
బలుకుతోడ యేమొ లలిత నీకు."

ఈ మహాశయ ప్రశంస ఎంతయు సత్యము. జనమంచివారి రామాయణము వాల్మీకానుసరణ రమణీయము. సుందరకాండములోని ఒక మూల శ్లోకము, దాని యనువాదము చూడవచ్చును. సందర్భము స్పష్టము.

శ్లో॥ అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేంద్రియమ్॥  
నయంతి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవమ్॥

పరవనితా రతిన్ వదలి భార్యలతోనె రమింపు మింకనే  
పురుషుఁడు భార్యలందుఁ దమిఁ బూనక తృప్తినిగాంచకెంతయున్

స్మరగురు తాపమున్ గొనుచు, జంపలితేంద్రియుడై చలించి యా
వరుసనె గూఢ విప్రియ సుఖాందితి నొంది పరాంగనారతిం
బరగునొ వాని సంపదలు పొదగు; సర్వము పాడఘ్నుంటాటిమి

తెలుగునకు పాఠకునకు మూలశ్లోక వివరణాత్మకమైన శేషాద్రిశర్మగారి రామాయణము మనోహరము; భాషా మందనము

## శ్రీమద్రామాయణ కల్పవృక్షము

మహాకావ్యము. తెనుగులో పూర్వము భాస్కరరామాయణము లున్నవి తరువాత కాలములో గోపీనాథరామాయణాదులున్నవి. "రామాయణకల్పవృక్షము" యొక్క ఎత్తుగడవేఱు. తెనుగు సారస్వతములో ఇంతటి ప్రబంధము రామగాథా బంధురమైనది వేఱొకటి లేదు.

ఇది వాల్మీకమునకు యథాతథమైన తెనుఁగుగాదు. పరమస్వతంత్రమైన రచన. మూలమునకు భాష్యప్రాయము. తత్త్వమునకువ్యాఖ్య. తెలుగు భాషలోని, పూర్వపు తెనుగుకవులలోని రచనా శిల్పరహస్యములకు విహరణ ప్రదేశము; అపూర్వ కల్పనములకు ఆకరము. కల్పవృక్ష కర్త ఎవరన్నది యీనాడు ప్రశ్నకాదు.

"నన్ను నెఱుఁగరొ! యీ తెల్గునాట మీరు
విశ్వనాథ కులాంభోధి విధుని బహువి
చిత్ర చిత్ర ధ్వని బహు విచ్ఛిత్తి మన్మ
హాకృతి ప్రణేత సత్యనారాయణకవి"

నేటి కవితా సామ్రాజ్యమున విశ్వనాథ సత్యనారాయణగారిది ప్రథమ స్థానము. తొలినాడు నేడు తెలుగువాఙ్మయమున ఎన్నికావ్యప్రక్రియలున్నవో అన్నింట సత్యనారాయణ గారిది అగ్రపంక్తి. అతిలోకమైన ప్రతిభా సంపదచే అనల్పమైన వ్యుత్పత్తి వైభవముచే, అనంతరాయమైన అభ్యాస బలముచే ఆధునిక కవిప్రపంచమున విశ్వనాథ సత్యనారాయణగారు మహోన్నతపీఠము

నధిష్ఠించియున్నారు. వారి నవలలు నాటకములు విమర్శనములు పాటలు - శతాధికముగా ఉన్న సర్వ సారస్వతము ఒకయెత్తు - రామాయణకల్పవృక్షము ఒకయెత్తు ఇది వారి భక్తిరచన, జాగ్రదవస్థలో స్వప్న సుషుప్తులలో వారిమానస జిహ్వలు రామనామ గ్రహణమే చేయునంట. సకలోహా వైభవ సనాథమైన శ్రీరఘునాథ కథారచనకు ఏక హేతువు తంద్రియాజ్ఞయు జీవుని వేదనయు నట:

"కవి ప్రతిభలోన నుండును గావ్యగత శి
ల్పాంశములయందుఁ దొంబదియైదు పాళ్ళు
ప్రాగ్విపశ్చిన్మతంబున రసమువేయి
రెట్లు గొప్పది నవకథాకృతిని మించి."

స్వీయ ప్రతిభా విశేషముచే తన కల్పవృక్షమును రసనిధానమును చేసికొని, తెలుగు రామాయణకర్తలలో కోటీరస్థానము నందుకొన్న సామ్రాట్టు సత్యనారాయణగారు. వాల్మీకము కరుణరస ప్రధానమన్నది స్పష్టము. విశ్వనాథవారు కల్పవృక్షమును శాంతరసాధ్యక్షముగా సంతరించుటలో ఒకవైశిష్ట్యము తెచ్చిన వారైరి. తెలుగులోని కవిత్రయ - పోతనల భారత భాగవతములు మహా శిల్పభూములు స్వతః రామాయణము రసరత్నాకరము పయివి రెండును ఇతిహాస పురాణ ధర్మము గలవి. రామాయణము కావ్యముకదా, కనుక రసము ముఖ్యము. సత్యనారాయణగారు భారతములో అంగిరసమైన శాంతమును రామాయణమున ముఖ్యముగా చేసికొని కరుణమునకు అవయవత్వము నిచ్చి, కల్పవృక్షమును కవిత్రయభారతమువలె శిల్పనిక్షేపమును చేసినారు. పోతనగారి భాగవతమువలె "భావభూమి"ని చేసినారు. తెలుగున రామాయణములెన్నేని పుట్టినవి. తెలుగు భారతము వంటిది జన్మించుట దుర్లభము, అట్లే పోతనభాగవతము వంటివియు, ఇంతకు మునుపటి తెలుగురామాయణములు రసైక దృష్టితో వ్రాయబడినవగుటచే వాని వాని గౌరవము, రసికాదరము వానివానికుండనే యున్నది. మాయణ కల్పవృక్షము కవిత్వ శిల్ప స్నిగ్ధమై శాంతరసమునకు ఆలవాలమైన మహా కావ్యముగా తానొక ప్రత్యేక పీఠము నలంకరించియున్నది.

నన్నయ్యయుఁ దిక్కన్నయు
నన్నావేశించిరి పఁబాహ మనస్సం
ఛన్నత వారలు పోఁఖున
తెన్నున మెఱుఁగులను దీర్చి దిద్దుచుఁబోదున్

అనియు, "ఇతడె తోడుకల్గినను నచ్చముగాఁగలకండ లచ్చులుం బోతఁలు పోసి యుండెవము పోతనగారివిధాన..." అనియు వారే విశదముచేసిరి.

పూర్వకవులు పోయినపోకడ లన్నియు కల్పవృక్షములో పరికింప వచ్చును. ప్రతిపద్యమున సత్యనారాయణగారిప్రత్యేకముద్రయుండును. ఏయొక్క సమాసము విన్నను. ఏ పలుకుబడి పట్టినను. ఏయొక్క ఎత్తుగడ చూచినను ఇది విశ్వనాథ వారిదిగా అనిపించును. రాయలు, రామకృష్ణుడు. పెద్దన-వేరేమి? సర్వప్రబంధముల తత్త్వమును సత్యనారాయణగారిలో దర్శింపవచ్చును. ఆయన కల్పవృక్షములో తెలుగుజాతి సంస్కృతి - తెలుగుబాస సొగసు - తెలుగువారి మాట యొడుపు - తెలుగుపద్యము నొయ్యారము తలమున్కలుగా ఉండును. భారతీయసంప్రదాయము పరిరక్షించుటకు దీక్షితుడైన మహాకవి సత్యనారాయణ గారు 'కల్పవృక్ష' సంభవమునకు కారణమైన ఒక సాహిత్యపారావారము. కల్ప వృక్షములోని సొగసులకు వేల పద్యములు ఉదాహరింపవలసియున్నది. సేతు బంధ ఘట్టమున నలుఁడు రామునితో అన్నమాట:

మనపని తీరినన్ జలధి మంథరగర్భ మహాపయోనిబం
ధనమున శ్రద్ధయున్ సడలినన యుగముల్ భవదీయ సేతుబం
ధనకృత చిహ్నముల్ చెడవు నా రచనాపటు శిల్పపాటవం
బనితరమై త్రికాలనిబిడాచ్ఛయశో నవమూర్తి మత్ప్రభూ

రామాయణకల్పవృక్షము రచనాశిల్పపాటవముతోనున్న సేతుబంధనకృతి.

"వలిఁ బేరుకొనిన కొబ్బరిమూనె చిదుపరే
సీమంతమునయందుఁ జెటివికొనిరి"

"ప్రాయికముగ దక్షిణాపథము నీఁకలు తీసిన కోడిపోలికన్"
"గంజిమడితవోలె గలగిల్లై పెళపెళనౌ మబ్బు మణికిరీటాళి ఁజూప"
"శోభానితవీచికల్ వెలగపండుల గుజ్జున పెర్గు పోసినట్లు"
"భరతుఁడు రాజై నాకును నొరిగించెడిదేమి, రాముఁ డొరిగించనిదేమి"?
"వాఁడు బ్రతికియే లేఁడు; ఉన్నచో వాఁడొక యంబ్రహ్మ"

(రావణవాక్యము)

అచ్చమైన తెలుగువాడి పోలికలు మాటచాలికలు.వేలకొలఁది కల్పవృక్షమునుండి చూడవచ్చును. ఆద్యతనాంధ్రకవి ప్రపంచ నిర్మాత చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారే చెప్పినట్టు "ప్రౌఢమార్గంలో అన్ని రామాయణాలనీ యిదే అతిక్రమిస్తుంది. సంస్కృతపద భూయిష్ఠంగా ఉండడమేకాదు; అర్థంలో కూడా కొంత గాంభీర్యం ఉంది. కవిత్వం చాలాబింకంగాఉంటుంది. మెత్తనివి చాలాతక్కువగా ఉంటాయిగాని బిరుసుగా ఉండే పద్యాలు ఎక్కువ. ఇతని కవనాన్ని వ్యాకరించ డానికి చాలా పిండి వుండాలి"—

గీ. "వృక్షమా, మున్నె యున్నది బీజసిద్ధ
తంబయై గోచరించు నేత్రముల కెందు
అసలె రామమయంబయినట్టి జగము
నప్పుడే రామమయ మయినట్లె తోఁచె."

గీ. సర్వ దుఃఖ హరమ్ము కౌసల్య పూర్వ
జన్మ సంస్కృతి యోంకార సదృశమైన
తత సదృశ రామనామమ్ము ధాన్యలక్ష్మి
అపగత నిహోళమౌ నెవ నత్తుకొనియె.

క. ఒక జీవి యాత్మలక్షణ
మకటకటా వాని మూర్తియందున మొగమం

దొక తీర్పు వేస మందున

నొక కట్టిన యింటి యందు నొప్పారు నహో!

పై పద్యముల సందర్భము చెప్పనక్కఱలేదు. విశదము. శ్రీరఘురాముని పట్టాభిషేకము-ఉపసంహరణ ఖండములోని ఒకపద్యము తలంపునకు తెచ్చుకొనవలసినది

అబ్జబాంధవ మండలాంతరమున నుండి
దిగివచ్చినది కిరండిత మహస్సు
తొలి విరించి వినిర్మిత లసత్కిరీటాది
మహితానుభావుఁడా మనువు తోఁచె
తొలి జీవులు సనాతనులు విభీషణ ముఖ్యు
లతితర ధ్యేయ రూపాదియయ్యె
నయన మార్గాంత ద్వ్యశ్యాసిత సౌదామ
నీ మయప్రహద మధ్య నీరజంబు
పరమ మాణిక్య కేయూరవంతుఁ డగుచు
మకర కుండల మణిమయ మకుటుఁడగుచు
లలిత వక్షస్థలీ వినీల మణి యగుచు
శ్రీ రఘుస్వామి పట్టాభిషిక్తుఁడయ్యె.

రామాయణ కల్పవృక్షము యుద్ధాంతము ఆఱు కాండముల గ్రంథము. కాండమున అయిదేసి ఖండములు. మొత్తము ముప్పదిఖండములు. ఇష్టి-అవతార-అహల్యా, ధనుస్, కల్యాణ ఖండములు; అభిషేక, ప్రస్థాన. మునిశాప, పాదుకా అనసూయాఖండములు; దశవర్ష, పంచవటీ, మారీచ, జటాయుః, శబరీ ఖండములు; నూపుర, గజపక్షీ, నియమపాలన. సమీకరణ, అన్వేషణఖండములు; పూర్వరాత్ర, పరరాత్ర. ఉషస్, దివా, సంధ్యాఖండములు; సంశయ, కుంభకర్ణ, ఇంద్రజిత్, నిస్సంశయ, ఉపసంహరణఖండములు. బాలకాండము అవతారికలో "మీరేసుకాండమ్ము లచ్చువేయించి యిచ్చెడి పౌత్రమ్ములు సీతావ

మ్మున సొత్తే"-అను మాటనుబట్టి ఉత్తరకాండము రచనోద్దేశ్యము కావచ్చును. రామాయణకల్పవృక్షము భారతీయ జ్ఞాన పీఠమువారిచే లక్షరూప్యముల మహార సమ్మానము పొందియున్నది.

## శ్రీరామాయణము: వేంకటపార్వతీశ్వరకవులు

బాలాంత్రపు వేంకటరావు, ఓలేటి పార్వతీశము అనువారు కలసి వేంకటపార్వతీశ్వరకవులు. పిఠాపురము. వెంకటరావుగారిజనన - నిర్యాణవత్సరములు 1880-1972, పార్వతీశముగారివి 1882-1956. "ఏకాంతసేవ" అను వీరి పద్యకృతి అభినవాంధ్ర కవిత్వయుగమునకు మేలుకొలుపు ప్రమదావనము. సీతాదేవి-సీతాదేవి వనవాసము. నీ పూజ, మున్నగు నవలలు వీరివి ఎన్నో ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల వెలువరించినది. రాధాశశాంకము, సువర్ణమాల వంటి నాటకములు వీరిప్రచురితములు. ప్రమదావనము, కావ్యకుసుమావళి పద్యకావ్యములు పేరుగడించుకొన్నవి. కవిరాజ హంస బిరుదాంకితులు వెంకటపార్వతీశ్వర కవులు వాల్మీకానుసారిగ రామాయణము పద్యమున వ్రాసినారు. లలిత మనోహరమైన శైలి. సుందరకాండమువఱకు అయినది. పార్వతీశముగారు దివంగతులైరి. ఆయనకుమారులు అచ్యుతరామచంద్ర మూర్తిగారు తద్రచనయకా, ఆ రామాయణమును పూరణము చేసిరి. అచ్చుకావలసియున్నది.

## విశిష్టరామాయణము : గడియారము వేంకటశేషశాస్త్రి

శివభారత కర్త మహాకవి గడియారము వేంకటశేషశాస్త్రిగారు వాల్మీకము ననుసరించి తెనుగులో రామాయణము రచించుచున్నారు. నిర్వచనము. శివభారత కవితవలెనే జగజ్జేయము సుధాప్రాయమునైన కవిత్వరీతితో ఉన్నది. నేటికి మూడుకాండములుమించి రచనయైనది. పూర్తియై త్వరలో తెలుగువారికి విందు సేయగలదు. "పరహిత మాత్మనిర్వృతి యపార యశోధన గౌరవాది విస్ఫురణము లందఁజేసి యిహమున్ బరమున్ వెలయించి మానవున్ ధరఁ జరితార్థుఁ జేయు కవితాకళ" - గడియారమువారి పరమగుటచే వారి రామాయణమునకు ఒక విశిష్టత చెప్పకచెప్పును.

## సుభద్రారామాయణము : సరస్వతీ రామాయణము

కవయిత్రులలో మొల్లతరువాత రామాయణరచయిత్రులున్నారు. సీరము సుభద్రయాంబ సుభద్రారామాయణము అను పేర రెండువేలపద్యములతో వ్రాసెను. ఆమె సెట్టిలక్ష్మీనరసింహముగారి అప్పగారు. ఆమె ఉత్తర రామచరిత్రము పద్యకావ్యముగా వ్రాసెనట. 19, 20 శతాబ్దుల నడిమికాలము. చేబ్రోలు సరస్వతీదేవి రచించిన 'సరస్వతీరామాయణము' (1984) కొంతపేర్వడసిన రచన. పూర్వభాగము ఉత్తరకాండముకూడ ఇందుకలవు. ఈమె కవికోకిలహంసి, అభినవ మొల్ల బిరుదములు పొందియున్నది. కవిత్వము సరళముగా సరసముగా సాగినది. పాయసవిభాగము, అహల్యావృత్తాంతము, కాలనేమికథ, మున్నగు కొన్ని కథాంశములనుబట్టిచూడగా నీమె మొల్లరామాయణమును అనుసరించి వెళ్లినటుల తెల్లమగుచున్నది.

## గోవింద రామాయణము

ఆత్మకూరి గోవిందాచార్యులు 1901. వేలువేలు రామాయణాల పోకడలను పొసగుకొన్న గ్రంథము. శ్రీరామాయణవ్యాఖ్యావిశేషము ఇందు గోచరించును, కవిత హృద్యము. పూవవలె గుభాళించుమాటలు. పులకింపజేయు భావములు. సర్వసుబోధమైన సంతరింపు. భక్తిబంధురముగా తీర్చిన కబ్బము. కైక శరణాగతి, రాముని అభయప్రదానము ఈ కావ్యమునకు నవ్యతనిచ్చిన ఘట్టములలో నొకటి. [illegible]ములో మంథరపాత్ర చెప్పుకోదగ్గది. కైక కౌసల్యా సుమిత్రలతోపాటు చిత్రకూటమునకు వెళ్లను. వసిష్ఠునివెంట వెళ్లి రామునితో ఏకాంతమున అనుచున్నది.

చ. మన గురుఁడౌ వసిష్ఠముని మాన్యుఁడు నేఁడె వచింప వింటి నీ
జనన విధమ్ము నాది పురుషా! యవివేకముఁజేసి నిన్నిటుల్
వనమున కంపితిన్ బతితపావన! దుష్టను గ్రూరురాల నన్
గనవొ కృపన్ దయాపర! యకార్యము చేసినదానఁ బాపినై.

శా. మాయామోహితచేతనన్ బతితనున్ మాతాథ' నారాయణా!
మాయామానుషరూప మూని జగతిన్ మాయం బడంద్రోయుదే
నా యీ మోహజలాబ్ధి నీఁదటకు నిన్ నా దిక్కుగాఁ జూతు నీ
మాయందాటఁగ నాకు శక్యమొకో రామా! ఆపద్ధారకా!

మంథరమాట విని చెడిపోతినని కైక క్షమింప వేడెను, రాముడు ఆమె శరణాగతికి జవాబుగా 'అమ్మా! నీవు మోక్షము పొందగలవు. దుష్టశిక్షకు, శిష్టరక్షకు నాకు నీవు సాయపడితివి. ఈ విధమున హరిసేవ నీవలన జరిగెను. అరణ్యవాసము నాకుగా నేను చేసితిని. నీవొక నిమిత్తము. పాపము నింద భరింపవలసి వచ్చినది నీవు' అనును గోవిందరామాయణము కథావిశేషములతో రమణీయమైనది.

## ద్విపదలో రామాయణములు:

## రంగనాథ రామాయణము

తెలుగు జాతిపద్యములలో 'ద్విపద' అన్నది ఒక రకము. ద్విపద అనగా రెండు పాదములు. సామాన్యముగా పద్యములు నాలుగు పాదములు. ద్విపద దేశిఛందము. పలు రామాయణములెల్ల జాతి-ఉపజాతి- పద్యవృత్తములలో వ్రాయబడినవి; అవి పద్యకావ్యములు. పద్యకావ్యము లున్నవానిలో "ద్విపదలు" అక్కడక్కడ ఉండవచ్చును. ద్విపదకావ్యములలో పద్యములు అనగా కందము చంపకము మొదలగునవి ఉండవు. చివరిదాక ద్విపదలోనే నడచును. ఈ ద్విపద పాటకు అనుకూలముగా ఉండును. పామరులు, సామాన్యులు, స్త్రీలు దీనిని ప్రచారమునకు తెచ్చిరి. తొలినాడు సమాజమున దీనికి గౌరవము తెచ్చినవాడు పాల్కురికి సోమనాథుడు. ఆయన శైవుడు, పిమ్మట రంగనాథుడు ద్విపదలో రామాయణము వ్రాసెను. దీనికి రంగనాథరామాయణమని ప్రసిద్ధి. గోనబుద్ధారెడ్డి దీనికి కర్తయనియు, తండ్రి విఠ్ఠలున కీకృతి అంకితము చేసెననియు కొందరు పెద్దలు సిద్ధాంతములు చేసిరి. 13వ శతాబ్ది 14వ శతాబ్ది నడిమి కాలమట. వాల్మీకిమునకు అనువాదమే కాని, కథలో మార్పులు

చేర్పులు కొన్ని కలవు. లోకములో ప్రచలితములైనవి, భాస్కరరామాయణము నందున్నవి దీనిలో కొన్ని కథావిశేషములున్నవి. గౌతము శాపముచే నింద్రుడు కోడియై కూయుట-హనుమంతు తోకకు చిచ్చుపెట్టినపుడు అతడు బ్రహ్మమంత్రములు చదివెననియు బ్రహ్మపాశము లాడెననియు చెప్పుట - అగ్నిసూక్తజపము- ఉడుతభక్తిం జూచి శ్రీరాముడు మెచ్చుట - నాగపాశబద్ధులైన రామలక్ష్మణుల కడకు నారదుడు వచ్చుట - సులోచనా వృత్తాంతము-రావణవధానంతరము రాముడు సేతువునగ్గల లింగప్రతిష్ఠ చేయుట- పట్టాభిషేక సందర్భమున విందు చేయుట-లక్ష్మణదేవర నవ్వు-ఊర్మిళాదేవి నిద్ర-ఇత్యాదులు పరికింపవచ్చును. దేశీయతా మనోహరమైన రచనగా రంగనాథరామాయణము సుప్రసిద్ధము. ఇది సంస్కృతకావ్యమునకు తెనిగింపు అయినను స్వతంత్రమైన రీతిలో జాతీయమైన విశేషములతో సర్వజనీనమైన కావ్యముగా పేరుగడించినది.

దాశరథుల బాలక్రీడలు: కవిత్వపు మచ్చు

కిల్లరి నగవుల కన్నులు తెరచి
యల్లనల్లనఁ దప్పటడుగులు వెట్టి
సల్లికి గొన్నుతొక్కు మాటలు నేర్చి
యెల్లవారికిఁ జాల నింపు కొనర్చి
కొద్దిగా ముత్తెంపు గొనబు వజ్రాల
వద్దికాయలఁ దాలు మలయఁ జెక్కిళ్లఁ
బ్రాకటంబుగ బాల ఫాలేందుకళల
శ్రీరాకృతి రావిరేఖ లల్లాడఁ
బొగడొందు మగరాల పులిగోళ్లగొలుసు
జిగిదెందములయందుఁ జిందులుద్రొక్క
నెడ నెడ బలుపచ్చలే యడ్డిగలుగఁ
గనుపొప్పు మొలనూళ్ల గంటలు మెరయ
మవ్వంపుటందెలు పదంబుల రొదల్ సేయ
నవ్వులాటల బాల్యనటన లేర్పడఁగ

పిడ్డెలు నెరపుచు పిధుని నుందఱను
ముద్దులు గులుకుచు మోహవాక్కృతుల
నంటినా నలువురు నభివృద్ధినొందె......

రంగనాథ రామాయణము ద్విపదరామాయణములలో సర్వథా శ్రేష్ఠము దేశీయతా మహితము.

## వరదరాజ రామాయణము : మరికొన్ని ద్విపదలు

వరదరాజ రామాయణము కట్టా వరదరాజ రచన; 17వ శతాబ్ది, యథావాల్మీకము షట్కాండపర్యంతము. వేంకటేశ్వరస్వామ్యంకితము మఱియొకటి: ఏకోజీ రామాయణము. కర్త భోసల ఏకోజీ, జన్మతః మహారాష్ట్రుడట. తంజావూరు ఏలిక. 18వ శతాబ్ది ఇంకొకటి: ద్విపదోత్తర రామాయణము. ముదుంబై వేంకట కృష్ణమాచార్యులు.

తరిగొండ వెంగమాంబ పేర్వడసిన కవయిత్రి. 19వ శతాబ్ది. కడపజిల్లా లోని ఒక గ్రామము ఈమె నివాసముచేసినది. తండ్రిపేరు కృష్ణార్యుడు. భర్త ఇంజేటి వెంకటాచలపతి. వెంగమాంబ యిలువేల్పు తరిగొండ నరసింహస్వామి తిరుపతివేంకటేశ్వర భక్తురాలు, ఈమె "వాసిష్ఠరామాయణము" అను పేర ద్విపదలో వ్రాసెను. జ్ఞానవాసిష్ఠ రామాయణము దానికి మూలము. వెంగమాంబ పద్యకావ్యములు, శతకములు చాల రచియించెను. మేలికైత మామిడన్న సుభద్రాంబ అధ్యాత్మరామాయణము ద్విపదలో వ్రాసినది. సులభమైన తెలుగుశైలి మఱికొన్ని యుండవచ్చును. మొత్తము ద్విపదరామాయణములకు రంగనాథ రామాయణమే పరాయణము.

## తెలుగులో ఉత్తర రామాయణాలు : ౧. తిక్కన్న

రామపట్టాభిషేకముతో శుభాంతముచేయబడిన దానికి పూర్వరామాయణమని వ్యవహారము. మొదటి ఆఱుకాండముల కథ దీనిలో ఉండును. సీతాపరిత్యాగము, లవణాసుర వృత్తాంతము కుశలవ జననము, రామాశ్వమేధము, సీతా భూవివర ప్రవేశము, రామ స్వర్గారోహము– ఈకథ కలిగిన ఉత్తరకాండమును ఉత్తర

రామాయణమనుచున్నారు. ప్రత్యేకముగ. తెనుగులో ఉత్తరకాండ కథనే త్రైకొని వ్రాయబడిన రామాయణములలో తిక్కన నిర్వచనోత్తర రామాయణము కాలముచే, కవితాగుణముచే మున్మెుదటిది.

తిక్కనకవి భారతము వ్రాసిన కవిత్రయములో రెండవవాడు. నెల్లూరు మండలపాలకుడు; మనుమసిద్ధి ఆస్థానకవి.; మంత్రి. ఉత్తరరామాయణము భారతమునకు పూర్వరచన, అన్నియు పద్యములే. గద్యములేదు. అందుకే నిర్వచనోత్తరరామాయణమని పేరువచ్చెను. తిక్కనది 13వ శతాబ్ది. తిక్కన తాత భాస్కరుడు. ఆయన పూర్వరామాయణము వ్రాసెను. తిక్కన ఉత్తరరామాయణమునకు తిలపెట్టెను.

ఎత్తతి నైనను ధీరో
దాత్త నృపోత్తముఁడు రామధరణీపతి స
ద్వృత్తము సంభావ్యమగుట
నుత్తర రామాయణోక్తి యుక్తుఁడ నైతిన్.

ఈ రామాయణము పది ఆశ్వాసముల మహాకావ్యము వాల్మీకములోని ఉత్తరకాండము కథ ఆధారము చేసికొని పరమ స్వతంత్రముగా రచింపబడినది. రామనిర్యాణముతో ముగించుటకాక, సోదరులతో, కుశలవులతో సుఖముగా రాముడు ప్రజలను పాలించుచున్నట్లు చెప్పి కావ్యమును శుభాంతముచేసెను. మూలములోని కథను చాల సంగ్రహముచేసెను కావ్యమునకు యోగ్యమైన యితివృత్తముగా దానిని మలచుకొనెను, తిక్కన ఉభయకావ్యప్రౌఢిఁ బాదించు శిల్పములో పొరగుడు. కళావిముఁడు. తెనుగులో ప్రబంధరచనకు నిర్వచనోత్తర రామాయణముతో శ్రీకారముచుట్టిన కవిబ్రహ్మ. ఆయన తన తెనుఁగుకవితకు కొన్ని నియమములు కల్పించుకొనెను; అవి సూరులకు ఇంపు కలిగించునవి:

జాత్యముగాని మెప్పునుయిన సంస్కృత మెమ్మెుదఁ జొన్పు; వాక్యసౌ
గత్యము సేయుచో నయిన గద్యము తోడుగఁ జెప్పిపెట్టు; దౌ
ర్గత్యము దోఁపఁ బ్రాసము ప్రకారము వేఱుగు నక్షరంబులన్
శ్రుత్యనురూప మంచు నిడ; సూరుల కివ్విధ మింపు నింపదే?

లలిత పద హృద్య పద్యం
బులన కథార్థ ఘటిత పూర్వాపరమై
యలంతి యలంతి తునియలఁ గా
హల సంధించిన విధంబు నమరఁగఁ జేతున్.

తిక్కన ప్రాంత వద్ద మాటలలో వేప్పచూపుటకు కవి లక్షణ మనెను. ఆయన పలుకులలో నవీనత ఉన్నది. రిత్తగాము, పొదవడగుట, ఆవిత్యాద్రి, తెలుగు ఐడి, ఫణిహారఁము- ఇట్టి పదములు పువిమీసల నుయ్యెలలూగి- చేతుల తీటకు మందుచేసెదన్- నీళ్ళులపట్టున నేయి మందొకో!— పాలతోడ విషంబిడు పగిది- కీలెడపిన జంత్రము క్రియ- వంటి లోకోక్తులు తిక్కన కవితలో పెక్కులు. నిర్వచనోత్తర రామాయణములో రంభా రావణసంవాదము, వేదవతీవృత్తాంతము, సీతాపరిత్యాగము, జానకీరాముల వనవిహార సందర్భములోని పద్యములు రెండు :

కలపంబు లభినవ గంధంబులుగఁ గూర్చి
తనువల్లిఁ గలయంగఁ దాన యలఁదు;
బువ్వులు బహువిధంబుగఁ గట్టి ముడికొక
భంగిగా నెత్తులు వట్టియిచ్చు;
హారముల్ మెఱయ నొయ్యారంబుగా గ్రుచ్చి
యందంబు వింతగా నలవరించు;
మృగపద పంకంబు మృదువుగా సారించి;
తిలకంబు వెట్టి నెచ్చెలికిఁ జూపు

జనకరాజతనయ మనము దలిర్పంగ
వివిధ నిపుణలీల వెలయ నిట్లు
చతురముగ నొనర్చు సౌభాగ్యసారాభి
రామమూర్తి యగుచు రామవిభుఁడు.

ప్రణయక్రోధము దాన యొక్కమెయి సంపాదించు; పాదాంబుజ ప్రణతిం గమ్మలఁ దీర్పు: నేర్పి ధరణీపాలుండు సాకూత భాషణముల్ పీనులనించు: మన్మథకలా స్వాతంత్ర్య మానంద పూరణ మార్గంబున నెల్లనిచ్చు రమణీరాగాబ్ధి పూర్ణేందుడై.

## ఉత్తరరామాయణము

## ౨. కంకంటి పాపరాజు

తిక్కన నిర్వచనోత్తరరామాయణము తరువాత అంతటి ప్రసిద్ధి సంపాదించిన మఱియొక ఉత్తరరామాయణము కంకంటిపాపరాజుది. అది నిర్వచనము; ఇది గద్యపద్య మయము. అది సంగ్రహము; ఇది విపులము. పాపరాజు రామాయణము ఎన్మిది ఆశ్వాసములు. మూడువేల పైచిలుకు గద్యపద్యములు మహాకావ్యలక్షణ లక్షితము. మదనగోపాలాంకితము. పాపరాజుది నెల్లూరి మండలము. 16, 17 శతాబ్దుల నడిమికాలపు కవి. వ్యుత్పన్నుడైన కవి. ప్రతిభాశాలి. ఈయన ఉత్తరరామాయణము చాల ప్రతిష్ఠ సంపాదించినది. తెలుగుదేశములో దీనిలోని పద్యములు పెక్కుమందికి కంఠస్థములు. పండితులు పామరులు కూడ ఇందలి పద్యములు చదువుచు "ఓహో" అనుచుందురు సీతానివాస ఘట్టములో కంకంటివారి కవిత్వము తెలుగువానికంట నీరు పెట్టించును; కరుణరసమును తీర్పుటలో అతనికతడు సాటి. రచనలో సంస్కృత పదప్రామర్య మెంతటిదో, తెనుగు పలుకుబడియు నంతటిది. రసానుకూలమైన కవిత్వశైలి. భక్తి రస పుష్కలమైన మనోధర్మము. "ఇహపర సాధకంబగు రహించు ప్రబంధ మొకర్ప శ్రీరఘూద్వహుని చరిత్రము" పాపరాజునకు దొరకినది. "జానకీజాని కథల్ రచింపక యసత్కథ లెన్నిరచించెనేనియున్ వాని వివేకమేమిటికి వాని కవిత్వ మహత్త్వ మేటికిన్"- ఇదీ ఆయన హృదయము.

ప్రతి తెనుగు హృదయమునందు సీతావివాసన ఘట్టము చిత్రితము చేసిన కంకంటి పాపరాజు కవిత్వమునకు కొన్ని మచ్చులు:

జానకిని సౌమిత్రి కానలో విడిచినాడు. రామాజ్ఞ ఆమెకు తెలుపవలెను. ఎట్లుతెలుపవలెనో అర్థము కాకున్నది. ఒకమూల దుఃఖము పొంగివచ్చుచున్నది.

"జననీ! నీవు మహాపతివ్రతవు నీసౌశీల్య మిల్లాంధ్ర కె
ల్లను మేల్బంతి; రఘూద్వహాంఘ్రి యుగళీలగ్నాత్మవై యుండుమీ!
యని నేనెవ్వఁడ విన్నవింప......"

అని వినీతుడై చెప్పుకొన్నాడు లక్ష్మణుడు. పాపరాజు ఈ ఘట్టమును సీతా లక్ష్మణులలో లీనమై వ్రాసినాడు. లక్ష్మణుడు శోకచలితుఁడు-

మితిలేని యీ మిడిమేలంపు మెకములు
సకియల బలగమే జననీ! నీకు?
పరికింప రాని యీ బలుమలల్ నవరత్న
మయ చంద్రశాలలే? మాత! నీకు
కడు భీతిముంచు నీ గహనముల్ విహరింపఁ
దగిన పూఁదోఁటలే? తల్లి! నీకు
ఘోరనక్ర భుజంగ కోటిలో మలయునీ
హ్రదములు కొలఁకులే యంబ! నీకు

బంధురములైన యీ మహా ప్రస్తరంబు
లిందుమణి వేదికలె జనయిత్రి! నీకు
కటకటా! యొంటి నిచ్చోట నెటులునిలిచె
దమ్మ! నీయునికి- కేమందు నమ్మ! నేను

చివరకు లక్ష్మణుడు లోకాపవాదమునుగూర్చి ఆమెకు చెప్పక తప్పలేదు. పిమ్మట సీతమ్మ నోట పలికించిన మాటలు సర్వాంధ్రజగత్తుకో ప్రతిధ్వనించుచునే ఉన్నవి:

ఎడపక పూర్వజన్మమున నే మిథునంబులఁ బాయఁజేసి వా
రడలఁగ నవ్వుచుండితినొ? ఆయఘ మూరకపోనె? నాఁడు కా
ఱడవుల రామపాద జలజాప్తి వసించితి; నేఁడు నాథు పొం
దెడసి యనాథనై యచట నేగతి మేన ధరింతుఁ బ్రాణముల్,

కటకట! లక్ష్మణా! పిడుగుకంటెను బెట్టిదమైన మాట నేఁ
డిటు వినియుండియున్ బగుల దింతలు నింతలు గాదు గుండె యె
ప్పటివలె నున్న దీ కటికభావముతో ససువుల్ ధరించి యి
య్యటవిని నె యింక నేవలన నాపద లొందఁగ నున్నదాననో;

పతిమతి నెంచెనేమొ! తను బాసి యశోకవనంబులోపలన్
బ్రతుకదె పెక్కునా ళ్ళనుచుఁ గ్రమ్మఱఁ దాఁ జనుదెంచు శత్రుసిన్
హతునిగఁ జేయు నేలనను నాశగదా బ్రతికించె నాఁటి కా
గతి నిఁక నేమి యాసఁ గొని కాయము నిల్పుదు తెల్పు లక్ష్మణా!

ఆకర్ణాయతనేత్రమై మణిమయోద్యత్కుండల ద్వంద్వ శో
భా కీర్ణాంచిత గల్లమై సురదనంబై సుందర భ్రూయుతం
బై కల్రప్రస్మిత చంద్రికా ధవళితంబై యొప్పు శ్రీరాము మో
మీ కాయంబున జూచు భాగ్య మిఁక లేదేమో సుమిత్రాత్మజా!

వనమున కేల వచ్చితివి వల్లభునిం బెడఁబాసి యొంటిగా
వని మునిపత్నులెల్ల గుమియై యడుగన్, ధృతిమాలి వారికే
మని వివరింతు! నింత విపదంబుధి నేకరణిం దరింతు! నే
యనువున నీ ప్రతీక్షణ మహాయుగముల్ క్రమియింతు లక్ష్మణా!

పోయిరమ్ము శుభమ్ములు పొందు నిన్ను
నన్ను మఱకవయుండుమా యన్న!...

అంకంటి పాపరాజు ఉత్తర రామాయణము సర్వోత్తమమైన కావ్యము; రసోత్తరమైన రచన.

మఱియు జయంతి రామభట్టు ఉత్తరరామాయణ శేషము వ్రాసెనఁట. తిక్కన నిర్వచన కావ్యమున కిది ఏతాళ్యాపమైన శేషగ్రంథము; ఘట్టు వేంకట రామకృష్ణకవి పట్టాభిరామాయణము ఒకటి ఏనుకలి లోనిది. ఇంకను ఉండవచ్చును.

## తెలుగులో అధ్యాత్మరామాయణాలు

అధ్యాత్మ రామాయణము వ్యాసప్రణీతము; బ్రహ్మాండ పురాణములోని సంహిత. పరమశివుడు పార్వతి కుపదేశించినటులున్నది. కొందఱు ఇది విశ్వామిత్ర కృతమందురు. వాల్మీకి రామాయణములో రాముని దైవత్వము గుప్తముగా నుండును. దీనిలో రాముడు కేవల పరమాత్మగాఁ సీత మహామాయగా కథ నడచును. అధ్యాత్మములోని రాముడు పుట్టగానే తన భగవత్స్వరూపమును కౌసల్యకు చూపించును: నారదుడు రామునియొద్దకువచ్చి రావణ వధకు ప్రేరేపించును. దేవతాప్రార్థనచే సరస్వతి మంథరలో ప్రవేశించును. రావణుడు శ్రీరాముని శ్రీహరిగా తెలిసికొని సీతాపహరణమునకు నిశ్చయించుకొనును. రాముడు సీతను అగ్నిలో ఉంచును. మాయాసీతను ఆశ్రమములో ఉంచును. అధ్యాత్మమన్న పేరే ఈ కథాపద్ధతిని సూచించుచున్నది సంస్కృతములో నున్న ఈ యధ్యాత్మమును పద్యములలో, గద్యములో, కీర్తనములుమున్నగు రూపములలో తెనుగునకు తెచ్చినవారు పెక్కుమంది. కొందఱి పేరులుమాత్రమే వినబడుచున్నవి. గ్రంథములు దాగికొని యున్నవి.

ముదుంబై వేంకటకృష్ణమాచార్యులు, పరశురామపంతుల రామమూర్తి, కోటమరాజు నాగయ, కృష్ణగిరి వెంకటరామకవి, అల్లమరాజు రామకృష్ణకవి, అకొండి వ్యాసమూర్తిశాస్త్రి, మోదుకూరి పండరినాథకవి, ఉప్మాక నారాయణమూర్తి... వీరు పద్యరూపములో 'అధ్యాత్మము' వ్రాసిన కవులు.

దూర్వాసుల రామయకవి "అధ్యాత్మ రామాయణము" పిఠాపురమున వేంకటరామకృష్ణకవులు ముద్రించిరి. అరణ్యకాండము వఱకే ఉన్నది. రామయ కవి శ్రీసూర్యనారాయణ కరుణచే కవిత్వమును పొందినవాడు. జగన్నాథుని కుమారుడు. ఈయన కవిత సమర్థము, సలక్షణము, వ్యుత్పత్తిసోపస్కము. వినయమిట్లున్నది ?

చ. *సురుచిర శాస్త్ర మర్మ పరిశోధ లెఱుఁగని వాఁడఁ బద్మినీ*
*పతిచరణాంబుజంబు లనవద్య మనీష భజించి తత్కృపా*

భరితుఁడనై రచించెదను బాలురు పల్కిన పల్కు లెల్ల సా
దరమతి గారవించు గతిఁ దప్పుల నొప్పుగఁడీ [illegible].

గ్రంథములోపలఁ జొచ్చి చూచినచో పద్యము సొంపు ఇట్లున్నదనుటకు ఒక యుదాహరణము.

పొందామరగవ నింపొందు గెంపుఁ జోలి
 కుచ్చెళ్ళకుది యడుగులఁ జిలింప
నుదిరి మెట్టెల మీద మెలయు వాకల నాగఁ
 జనుఁ పై ముత్యపు సరు లెసంగ
యమునాపగోపరి నమరు లేమొంద నా
 నాకుపై పొంబట్టు చీర మెఱయఁ
బున్నాగ ఫణమణి పోలిక జలరాగ
 తరళంబు నాభిపైఁ దాండవింప

మైథిలీ నామ నవ్య శంపా లతాంగిఁ
దోడుకొనివచ్చె సహచరి గూడి జనక
జనవిభుఁడు భద్రగుణజాలశాలియైన
రామచంద్రుని పాలికి రామలీల.

## నిర్వచనాంధ్ర అధ్యాత్మరామాయణము

"ఆత్మతత్త్వ శాస్త్ర మధ్యాత్మరామాయ
ణంబు మోక్షదాయకంబు దీని
నిరుపమాంధ్రభాష నిర్వచనంబుగా
బులుసు వేంకటేశ్వరులు రచించె."

ఈ గ్రంథము రెండు సంపుటములు. సుమారు నాల్గువేలపద్యములు. కర్త బులుసు వేంకటేశ్వరులు. విద్వాన్; ఎం. ఏ పట్టభద్రులు. వేంకటేశ్వరులుగారు

బహుగ్రంథకర్తలు. ఆధునికులగు సంప్రదాయకవులలో పేరువడసినవారు. ఋషుల చరిత్రలు సంపుటములుగా వెలువరించిరి. భారత భాగవత రామాయణములు మూడును నిర్వచన పద్య గ్రంథములుగా వ్రాసిన శక్తియు అదృష్టము వేంకటేశ్వరులుగారికి ఒక్కరికే లభించినవి. తెలుగుకవులలో శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారొకరు వెనుకటి తరములో ఇట్టి భాగ్యమునకు నోచినవారు. తరువాత వీరు. అంతకంటె అతిశయమైనది ఈ గ్రంథముల నిర్వచనత. వేంకటేశ్వరులు గారిది స్వభావతః ఆధ్యాత్మ దృష్టి. వాల్మీకముకాక, ఈ రామాయణమునే గ్రహించి తెనిగించినారు. ఆత్మజ్ఞానాపేక్ష గలవారికి ఈకృతి నిత్యపారాయణ యోగ్యము. ఇందలి పద్యములు సకలగమ్య సుతీర్థములు; ధారాళతా మనోహరములు; భక్తి రస బంధురములు. సులభ సుందరములు. భరతుడు చిత్రకూటమునకు వెళ్లి, అక్కడి మునులను సీతారాముల యునికిని గూర్చి ప్రశ్నించెను. వారు చెప్పుచున్నారు;

అదిగో కొండకు వెన్క నున్నదదిగో ఆయుత్తరంబందు న
య్యదె యేకాంతము సుందరం బయినదై యానంద సంధాయకం
బదె శ్రీరాముని పర్ణశాల యదిగో యత్యద్భుతంబుల్ ఫల
ప్రదముల్ వృక్షలతా నికుంజములు శోభం గన్నదే యల్లదే!

అదిగో, మామిడులున్ సదా పనస వృక్షాళికముల్ సత్ఫల
ప్రవరంబుల్ కనుఁడీ యరంటి గెలలున్ వ్యాప్తంబుగా సంపెగల్
అవిగో కోవిదముల్ కనుండవిగొ దివ్యంబైన పొన్నల్ కనుం
డవిగో పాదపముల్ రఘూత్తముని యిల్లందే యదే చూడుఁడీ.

అని మౌనులు చూపించిన
గని భరతుఁడు మంత్రితోడఁ గడు సద్భక్తిన్
వినుతంబగు శ్రీరాముని
యనుపమ మగు పర్ణశాల నవలోకించెన్. అయోధ్య. 8 సర్గ.

బులుసు వేంకటేశ్వరకవి ప్రణీతమైన నిర్వచన - అధ్యాత్మరామాయణము సాటి కృతులలో మేటి.

## వివిధరామాయణములు : తెలుగుసేతలు

వాసిష్ఠరామాయణము మడికి సింగన తెలుగుపద్యములో వ్రాసెను; సంస్కృతమూలము వశిష్ఠ కృతము. వాల్మీకి కృతమనియు చెప్పుదురు. జ్ఞానవాసిష్ఠము అని దీనికి మరియొక పేరు. ఇది వైరాగ్యాదులగు ఆఱు ప్రకరణముల గ్రంథము. వేదాంతబోధకము. వాసిష్ఠరామాయణాంధ్రీకర్త సింగనకాలము 15వ శతాబ్ది. ఈతడు పద్మపురాణమున ఉత్తరఖండము, భాగవత దశమస్కంధ ద్విపద వ్రాసినవాడు. ఈ వాసిష్ఠము అయిదు ఆశ్వాసముల గ్రంథము. ప్రశస్తమైన తెనుగు పద్యరచన.

## తత్త్వసంగ్రహ రామాయణము

కర్త; అకొండి వేంకటకవి 1820 ప్రాంతము అభిజనము విశాఖ మండలములోని గజరాయవలస. సంస్కృత మూలము : బ్రహ్మానందస్వామి రచితము. భారతములోని విష్ణు, కూర్మ, బ్రహ్మాదాది పురాణములలోని కథలు సంగ్రహించి ఈ రామాయణము రచింపబడినది. వేంకటకవి తెలుగుకైత హృద్యము; అనవద్యము. ఈయన స్యాలకుడు వజ్ఝల అన్నయభట్టు ఈ రామాయణమున కొంత పూరణముచేసెను. "స్యాలకుడు మాకు సాహితీపాలకుండు వజ్ఝలన్నయభట్టు కవన విశేష, తులిత నన్నయభట్టురుబల సహాయ మొనరం జేయంగ నీగ్రంథమును రచింతు" అని వేంకటకవి చెప్పుకొనెను. ఈకవి "రామప్రభూ" అను మకుటముతో శతకము వ్రాసెను. ఆ శతకపద్యములలో కొన్ని శ్రీరామ స్తవ సందర్భమున ఈతత్త్వ సంగ్రహ రామాయణములో చేర్పబడియున్నవి. అందలి పద్యము ఒకటి:

అఘనాశాఖిల దేవతా నిచయ సౌఖ్యప్రాపకోద్యత్ప్రభా<br>
వఘనా ! దివ్య సువర్ణచేల మణిభాస్వత్కాంచి కాంచన్మహా<br>
జఘనా ! హార కిరీట ముఖ్య వర భూషాభూషిత ప్రోజ్జ్వలా<br>
పఘనా ! కీర్తిఘనా ! ఘనాఘన సమాభాధామ ! రామప్రభూ !

## విచిత్ర రామాయణము

నరసింహదేవర వేంకటశాస్త్రి ప్రణీతమైనది గద్యపద్యాత్మకము. ఏడు కాండముల గ్రంథము. శ్రీరామాంకితము. ఏతత్కవి నివాసము తణుకు తాలూకా వెలగదుర్రు. 1828-1915. గోపీనాథకవి వచనమున విచిత్ర రామాయణము వ్రాసెను. ఇది పద్యకావ్యము. తన ముప్పదవయేట రచన నారంభించి మూడేండ్లలో యుద్ధకాండాంతము వ్రాసెనని చెప్పుకొందురు. ఉత్తర కాండము తమ 78వ యేట ముగించి ముద్రింపించిరట. బహుజనపల్లి సీతా రామాచార్యులగారు ఈ రామాయణమునుగూర్చి అభిప్రాయమిచ్చుచు "ఆధునిక గ్రంథస్థము లని తెలియక యిందలి గద్యపద్యములను విన్నవారు అవి పూర్వ గ్రంథస్థములే యని నిస్సందేహముగా తలతురు" అని వ్రాసెను. గ్రంథనామ మునకు తగినట్లు ఇందలి కథలో వైచిత్రి ఉన్నది.

## అద్భుతోత్తర రామాయణము

ఇందలి కథ అవాల్మీకము. అద్భుతమైనది. రావణ వధానంతరము రాముడు రాజ్యము చేయుచుండెను. సహస్రకంఠుడనువాని వృత్తాంతము ఆయన విని వానిమీద యుద్ధమునకు బయలుదేఱును. ఆ యుద్ధములో సహస్రకంఠుని చేతిలో రాముడు మడియును. అపుడు సీత మహాకాళియై సహస్రకంఠాసురుని సంహరించును. రాముడు బ్రహ్మవలన మరల జీవించును. దీనికి సీతామాహా త్మ్యము అని మఱొక పేరు. నాదెళ్ళ పురుషోత్తమకవి (1863-1938) ఈ రామాయణకర్త; అభిజనము కృష్ణాతీరస్థమగు సీతారామపురాగ్రహారము. నివాసము బందరు. చతుర్ముఖి కందపద్యరామాయణము అన్నదికూడ పురుషోత్తమ కవి కృతులలో ఒకటి. అద్భుతోత్తర రామాయణము కథచేతనే కాక, చిత్ర బంధ గర్భ కవిత్వ రీతులచేకూడ తన పేరును అన్వర్థము చేసికొనుచున్నది.

## తెలుగులో చంపూరామాయణములు; బాలరామాయణములు

భోజరాజ విరచితమైన చంపూరామాయణము సంస్కృతములో ప్రసిద్ధము. చంపు వనగా గద్య పద్య మయము. భోజచంపువును ఆంధ్రీక రించిన వారు పలుమంది ఉన్నారు. వారిలో ముగ్గురు

ఋగ్వేదకవి వేంకటాచలపతి (18వ శతాబ్ది)
అల్లమరాజు రంగశాయి (19 శ.)
జయంతి రామయ్యపంతులు (19 శ.)

బాల రామాయణము, సంగ్రహ రామాయణము అను పేరుపెట్టి వ్రాసినవారు అనేకులు ;

ఆదిపూడి సోమనాథరావు (19 శ.)
బుద్ధవరపు మహాదేవుడు (19 శ.)

కందుకూరి వీరేశలింగం పంతులుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు సంగ్రహరామాయణములు వ్రాసిరి.

## అన్యభాషలనుండి అనూదితరామాయణాలు :
## తులసి, కంబ కవులు

ముఖ్యముగా హిందీ, తమిళములు రెండు గొప్ప రామాయణములను ప్రసాదించిన అన్యభాషలు. తులసీదాసు మహాభక్తుడు. ఆయన హిందీ భాషలో రామచరితమానసము వ్రాసెను. ఇది ఉత్తరభారతముననే కాక, దక్షిణ భారతమునకూడ మిక్కిలి వ్యాప్తికి వచ్చిన మహాగ్రంథము. వాల్మీకమువలెనే తులసీరామాయణమును పారాయణము చేయుదురు. తెలుగువారిలో రామచరితమానసముపై ఉన్న గౌరవము సామాన్యముకాదు. దీనిని పద్యములో ఉభయములో ఆంధ్రరచయితలు అనువాదములు చేసికొనిరి.

భాగవతుల నరసింహశర్మ-ఆంధ్ర తులసీరామాయణము.

మైలవరపు సూర్యనారాయణమూర్తి అనువాదము మంచిరచన. తెలుగు పద్యములలో ఉన్నది. దినవహి సత్యనారాయణగారు రాజమహేంద్రవరము. మధురమంజులమైన వచనములో తులసీరామాయణమును రెండు సంపుటములుగా వెలువరించిరి. ఏలూరిపాటి లక్ష్మీ సరస్వతమ్మ క్రొత్తపేట నివాసిని. ఈమె

వచనములో ఆంధ్రతులసీ రామాయణము వ్రాసి ప్రకటించెను. హరివంశము, శివపురాణముకూడ ఈమె తెనుగు వచనమున రచించెను. సలక్షణము సుబోధము అయిన వచన రచన ఈమెది. మఱియు, చాలమంది తులసీరామాయణాంధ్రీకర్తలు ఉన్నారు.

రెండవ అన్య భాషారామాయణము కంబ కవిది. తమిళములో ప్రసిద్ధమైన గ్రంథము. దీనికి కంబరామాయణమని వ్యవహారము. కంబకవిది 12వ శతాబ్ది. రాజరాజనరేంద్రుని మునిమనుమడు మూడవ కులోత్తుంగచోళుని ఆస్థానమున సంభావితుడు కంబరు పరమభక్తుడు. కంబరామాయణము తమిళవాఙ్మయమున పేర్వడసిన మహాగ్రంథము. దీనిని ఆంధ్రీకరించిన కవివరుడు పూతలపట్టు శ్రీరాములురెడ్డి. జన్మస్థానము పూతలపట్టు, చిత్తూరుమండలము. 1892 జననము. ఈకవి తమిళమునుండి శిలప్పదికారము, నాలడియార్ తెనిగించెను. కంబరామాయణము బృహద్గ్రంథము. సుమారు పదివేల పద్యములు. అసాధారణమైన శైలీమాధుర్యము. ఈ గ్రంథమునకు కట్టమంచి రామలింగారెడ్డిగారి పీఠిక తిలకాయమానము. వారిమాటలు తిలకించినచో సత్యముగ్రహింపుట యగును.

"సాహిత్యములోను సంగీతమునందుంబలె మనకు వలసిన పరమార్థము సౌఖ్యము. ఆనందము. యాథార్థ్య మంతగ గాదు. ఈ తత్త్వముప్రకారము చూచినయెడల శ్రీరాములురెడ్డి కంబరామాయణము స్వతంత్రముగ రచించినకృతి యట్లు ఐక్యమును వహించి ఏకధారగా ప్రవహించి పాఠకులకు సంతతాహ్లాదకారియై ఉన్నది. కంబు నిస్మరణ లేకయే దీనిని చదివిఆనందింపవచ్చును. బింబమునకు ప్రతిబింబమాయను విచారణ కవకాశమీయనట్టి ఆనందకరమైన కళ. దీనినిచదివినపుడు చూచినపుడు హృదయ మిందే నిమగ్నమై లీనమై యుండుటయ దీని మాహాత్మ్యము. ఇదియే కవితాకళయొక్క సిద్ధియు, పరిపూర్ణత్వమును. శ్రీరాముడు సేతువును గట్టి లంకకు మనకు యానసౌకర్యము గల్పించినాడు గాని యది సంహారక్రియకై. ఈ శ్రీరాముడు ఈ భాషాసేతువును గట్టి తమిళులకు మనకు పరస్పర విద్యాజ్ఞాన వికాసములకై సౌకర్యము కల్గించినాడు ఆసేతువును సముద్రము మ్రింగివైచినది. ఈవాఙ్మయసేతువు ఆచంద్రార్కము శాశ్వతముగా నిలిచి అఱవలకు ఆంధ్రులకు నాగరకతా సాంగత్యమును పెంపొందింపగలదు."

కంబరామాయణము దేశపటలము, యాగపటలము, మిథిలాదర్శన పటలము మున్నగా పటలముగా విభజింపబడి యున్నది. మూలము వర్ణన బహుళము. కథ కర్ణరసాయనము. శ్రీరాములురెడ్డిగారి తెనుగు సోయగము నకు ఒక మచ్చు.

సీతాన్వేషణ కీవ యర్హుఁడని రాజీవాక్ష సుగ్రీవులే
ప్రీతిం బ్రేరణసేయ మేలనుచు నూరీకారముల్ దెల్పుటల్
చేతంబందున నుంచినాఁడ వది సీచే దీను నిక్కంబు నీ
చేతల్ ధాత్రిని సుస్థిరంబు లయి భాసిల్లున్ మనున్నందనా!

ఇంతకు మున్ను చెప్పబడిన "విచిత్రరామాయణము" అన్న గ్రంథమునకు: మూలము ఉత్కల భాషలో రచితమైనది. తత్కర్త సిద్ధేంద్రయోగి. దానికి గోపీనాథకవి తెనుగువచనము వ్రాయగా, దానిని అనుసరించి నరసింహదేవర వేంకటశాస్త్రి పద్యకావ్యము వ్రాసెను. హిందీ, తమిళ, ఉత్కళ భాషలనుండి అనూదితములైన రామాయణములు తెనుగు నవ్యాప్తిగాంచుట ఒకవిశేషము.

## ప్రబంధరూపములో రామాయణాలు; రామాభ్యుదయము ; మఱికొన్ని

రామాయణములోని కథ ఆధారముగా తెనుగులో ప్రబంధములు వచ్చినవి. నన్నయ భట్టారకుల 'రాఘవాభ్యుదయము' ప్రబంధము చెప్పకొనుటకే; దొరికినది కాదు. తరువాత "రామాభ్యుదయము' అయ్యలరాజు రామభద్రకవి వ్రాసినది ప్రశంసనీయమైన ప్రబంధము. ఎనిమిది ఆశ్వాసములు. ఉత్తరకాండ కథ కయికొనలేదు. రామపట్టాభిషేకముతో మంగళాంతము చేయబడెను. స్వతంత్రమైన ప్రబంధము. ఉద్యాన విహారాది వర్ణనములు ప్రబంధోచితముగా జరిగినవి. వాల్మీకములోనికథలు - గంగావతరణ, అహల్యావృత్తాంత, సముద్ర మథనాదులు-రామాభ్యుదయములో లేవు. దశరథుని పరిపాలనము, భార్యాసహితుడైన అతని వనవిహారాదులు-వీనితో కావ్యారంభమగును. రామాభ్యుదయకర్త అయ్యలరాజు రామభద్రుడు, రాయల కొలువులోని అష్టదిగ్గజములలో ఒకడుగా

ప్రసిద్ధుడు ఈ కావ్యము గొబ్బూరి నరసరాజునకు అంకితము. ఈ నరసరాజు కృష్ణరాయల అల్లుడైన అళియరామరాయలకు మేనల్లుడు. 16వ శతాబ్ది. రామభద్రకవి ముత్తాత తిప్పయ గొప్ప మనీషి. ఒంటిమెట్ట రఘువీర శతకనిర్మాణ కర్త. మునిమనుమడు రామభద్రకవి ముత్తాతను మించిన రామభక్తిపరవశుడు. ప్రబంధ నిర్మాణకర్త. రామాభ్యుదయములోని కవిత ప్రబంధానుగుణమగు ప్రౌఢిమాధుర్యములు కలది. లోకజ్ఞతాస్ఫోరకమగు వర్ణనముచేయుటలో ఈ కవి చాల దిట్ట. వక్రోక్తులు చమత్కృతులు పెక్కు చూపించెను. శ్రీరామ జననమును గూర్చిన పద్యములోని సొగసు చూడవచ్చును.

"దొరసి ప్రభాధురంధరుఁ జతుర్దశలోకధరున్ మహాత్మునే
కరణిని గోసలేంద్రసుత గాంచెనొకో యవి. నాభిపంకజాం
తరమువఁ బెక్కుబ్రహ్మల గనంగల వేల్పున కెట్లు బొడ్డు గో
సిరొ యని పల్కి రర్యమరుచిన్ రఘునందనుఁ జూచి చూపఱుల్.

వర్షారంభమును ప్రబంధముతో పోల్చి చెప్పిన మఱియొక పద్యము:

ధారాశుద్ధిఁ బ్రసిద్ధిఁగాంచి ఘనశబ్దస్ఫూర్తి వర్తిల్లగాఁ
దోరంబైన రసస్థితిన్ దరళ విద్యున్మాలికా లక్షణో
దారంబై కవిసేవ్యమై వనమయూరారూఢిఁ బ్రాపించి వ
ర్షారంభంబు ప్రబంధమ ట్లఖిల పద్యాక్రాంత మయ్యెం దగన్.

మహాప్రబంధరూపములో అవతరించిన రామాయణము రామాభ్యుదయము. అయ్యలరాజు కవిత తెలుగువారి చెవులకు చవి గొల్పునది.

తరువాత బిజ్జల తిమ్మరాజు వ్రాసిన 'అనర్ఘ రాఘవము' పద్యకావ్యము-బొడ్డుచర్ల తిమ్మయ రచించిన ప్రసన్నరాఘవము-పద్యకావ్యము, ఇవి సంస్కృత నాటక కథానుసారమై యున్నవని వినుట మాత్రము. పసుపులేటి రంగాజమ్మ (17 శ.) రామాయణ కథాసంగ్రహము వ్రాసెనఁట. ఆమె తంజావూరి ప్రభువు విజయరాఘవనాయకుని కొల్వుకవయిత్రి. మన్నారుదాసవిలాసము మున్నగు కృతులు ఆమెవి ప్రసిద్ధములు,

ఏనుగు లక్ష్మణకవి (18వ శ.) పెద్దాపుర సంస్థాన కవి. భర్తృహరి సుభాషితములకు తెనుగు పద్యములు వ్రాసిన యతఁడు. రామవిలాసము అను పేరుతో అయిదు ఆశ్వాసముల ప్రబంధము రచించెను.

వారణాసి వేంకటేశ్వర కవి 1820 ప్రాంతము. ఆఱు ఆశ్వాసములలో రామచంద్రోపాఖ్యానము పద్యగద్యాత్మకముగ వ్రాసి పిఠాపురము కుక్కుటేశ్వర స్వామికి అర్పణము చేసెను. మఱియొకరు; మంత్రిప్రగడ సూర్యప్రకాశకవి (19 శ.); మాడుగుల కృష్ణభూపాలుని ఆస్థానవిద్వాంసుడు. ఆఱు ఆశ్వాసములలో సీతారామచరిత్రము రచించెను. ఈయన కావ్య రచనాపటిమచే నృప కోటిని, మహాకవులను మెచ్చించినవాఁడనని చెప్పుకొనెను. సీతారామచరిత్రను ఆంధ్ర సాహిత్యపరిషత్తు, కాకినాడ, 1941లో ప్రథమాశ్వాసమును ప్రకటించినది సూర్యప్రకాశకవి పిఠాపురము దగ్గరనున్న తిమ్మాపురమున నివసించెను.

కాంచనపల్లి కనకాంబ-కవయిత్రి, విదుషి, గ్రంథములువ్రాసిన ప్రసిద్ధురాలు, కవి తిలక బిరుదాఢ్య. ఈమె ఒక రామాయణ కథా సంగ్రహము కంద పద్యములలో వ్రాసెను.

దాశరథి విలాసము - కొత్తపల్లి లచ్చయకవి రచితము (19 శ.). పిఠాపుర సమీపము చెందుర్తి నివాసి. ఐదు ఆశ్వాసములలో ఉన్న కావ్యము. తెనుగు కవిత్వము ప్రౌఢమైనది; ఈ కావ్యములో కొన్ని చమత్కృతులు కలవు. ఒకచోటి వచనము మచ్చునకు పేర్కొనబడుచున్నది.

"అట్టి సందడి కయ్యంబున అరసోలెడు మత్తదంతావళంబులును, సోలెడు హయంబులును, కయ్యంబునకు కాలుత్రవ్వెడు పదాతులను యుద్ధంబు మానెడు సైనికులును ఓహటించినవారి నిలునిలుండని అడ్డెడు సేనానాయకులును పూర్వ పాదంబులు కుంచెడు తురంగంబులును......"

ఈ వచనములో చమత్కారము చూడగలరు. అరసోలెడు, సోలెడు, త్రవ్వెడు, మానెడు, అడ్డెడు, కుంచెడు- మానార్థకములగు నీపదములతో యుద్ధ

రంగ వర్ణనము నెఱపెను. ఇట్టివి చాల ఈ కావ్యములో ఉన్నవి. ఈ గ్రంథకర్త సోదరుడు కొత్తపల్లి సుందరరామయ్య రామదాసు నాటకకర్త ప్రబంధ రూపమున వచ్చిన రామగాథా గ్రంథములు అనేకములున్నవి. ఉందవచ్చును. ఇక్కడ వకాశము స్వల్పము.

ద్వ్యర్థి కావ్యములలో రామాయణము వచ్చినది. రాఘవపాండవీయము పింగళిసూరన కృతి. ఈయన రాయల కొలువులో అష్టదిగ్గజములలో ఒకడని ప్రసిద్ధి ఉన్నది. కళాపూర్ణోదయము, ప్రభావతీప్రద్యుమ్నము రచించి పేర్గన్నవాడు. రాఘవార్థము, పాండవ పరమైన అర్థము వచ్చుచున్నట్లు వ్రాయబడిన ద్వ్యర్థి కావ్యము ఇది. రెండర్థములుగల పద్యము ఒకటి వ్రాయుటయే అశక్యము. కావ్యమంతయు రెండర్థములు వచ్చునట్లు వ్రాయుట చాల విశేషము కదా! అందుకే సూరన "దక్షుండెవ్వాడిల రామభారత కథల్ జోడింప భాషాకృతిన్" అని చెప్పుకొన్నాడు.

చిత్రకవి సింగరార్యుని రాఘవవాసుదేవీయము ఇట్టిదియే.

పిండిప్రోలు లక్ష్మణకవి లంకావిజయమన్న రావణ దమ్మీయము (తిట్టు కవిత). ఈకావ్యములో ఒకటి రామాయణార్థము. ఇట్లే త్ర్యర్థి కావ్యము "రాఘవ యాదవ పాండవీయము" ఎలకూచి బాలసరస్వతి రచితము మరి కొన్నియు ఉన్నవి.

## అచ్చతెనుగు లోరామాయణాలు:

ఇంతవఱకు మనము అనుకున్న కావ్యములలోని భాష తత్సమములు, తద్భవములు, దేశ్యములు అయిన పదములతో కలసియున్న భాష. తత్సమములు అన్నియు సంస్కృతశబ్దములే. కొన్నికొన్ని ప్రాకృతభాషాపదములునుఉండును. ఆపదముల చివర విభక్తిప్రత్యయములు తెలుగువారివి. 'రామః' సంస్కృతపదము రాముడు తత్సమము. ఇక్కడ 'డు' అన్న విభక్తిప్రత్యయముమాత్రమే తెలుగుది. ఇట్లే సర్వత్ర ఇట్టి తత్సమ పదములను ఉపయోగింపక తద్భవములు దేశ్యములు

మాత్రమే ఉపయోగించినచో అది శుద్ధాంధ్రము అగును. దానికే అచ్చతెనుగు అని పేరు. అట్టి తెనుగులోను రామాయణములు రచింపబడినవి. వానిలో కూచి మంచితిమ్మకవి (18. శ) అచ్చతెనుగురామాయణము తగినగౌరవము సంపా దించుకొన్న కబ్బము. ఈయన రీలాసుందరీ పరిణయముకూడా అచ్చతెనుగు లోనే వ్రాయబడిన కావ్యము. తెలుగువారికి సంస్కృత శబ్దములే అర్థమగు చుండును. కొన్ని తెనుగుపదములు బొత్తిగా క్రొత్తగా ఉండును. తత్సమభాషలో వ్రాసిన గ్రంథములకు వచ్చిన ప్రచార ప్రశస్తులు అచ్చతెనుగు కబ్బములకు రాలేదు. కారణము: అచ్చ తెనుగ పదములు పెక్కు అశ్రుతములై ఉండుట. ఈ కూచిమంచి తిమ్మకవి రామాయణములోని తెనుగుకొంత సుబోధము. కావున వలసి నంత వ్యాప్తికి నోచినది. ఈ తిమ్మకవి రామాయణమున ఉత్తరకాండము లేదు. ఆ కొదవ పూరణము చేయుటకో అన్నటుల కందుకూరి వీరేశలింగంపంతులు "శుద్ధాంధ్రోత్తర రామాయణము" రచించెను. మఱి, అబ్బరాజుహనుమంతరాయ శర్మ "అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య దాశరథి చరిత్రము" వ్రాసెను.

## స్త్రీల పాటలలో రామాయణము:

అనుక్రమముతగా వచ్చుచున్న రామాయణగాథ స్త్రీలపాటలలో ఎంతోముచ్చ టగా వినిపించును. రంగనాథరామాయణము ద్విపద పాటగా పాడుకొను అల వాటు తెలుగునాట ఉన్నది. స్త్రీల పాటలు కొన్ని రచయిత్రులు వ్రాసికొన్నవి: కొన్ని పురుష రచనలుకూడ కావచ్చును. ఈ పాటలలోని మాటలు తెలుగువారి గుండెలను పిండుకొని వచ్చినటులుండును. భావములు నిరాడంబరములు నిర్వ్యాజములు. తెలుగు వాడుకభాష సొగసునకు ఆ పాటలు ముద్దుమూటలు ఈపాటలలోని రామాయణకథలెన్నో వాల్మీకము చెప్పి ఉండలేదు. విచిత్ర రామాయణము, రంగనాథ రామాయణము కొన్నికథలకు మూల మనవచ్చును. లేదా, వానిలోని కథలకు ఈపాటలే మూలము లేమో: చెప్పలేము. సంక్షేప రామాయణము - సీతాకల్యాణము - సీతాదేవి వామనగుంటలు. సీత దాగుడు మూతలు - లంకాయాగము - లక్ష్మణ దేవరనవ్వు - ఊర్మిళాదేవి నిద్ర - కుశ లవ కుశప్పలకథ - లంకాయాగము - ఇట్టివి అనేకములు.

"సీతమ్మ వేవిళ్లు" పాటనుండి కొన్ని ముచ్చటకొ ఒచ్చుచుంటిని!

"పాదాల చప్పుడు పణతి వినకుండ పాన్పుమీద కొచ్చిరి పద్మనాభులు।
కూర్చున్న దాసీలు నిల్చుండిరంతా। ఆడవలె వోడవలె గెల్వవలెగాని।
ఆట విడిచి మీరు లేవ పనిలేదు। చిరునవ్వునవ్విరి దాసీలు అంతా।
ఉత్తరం దక్షిణం చూచెనా దేవి। తూరుపూ పడమరా చూచెనాదేవి।
ఆడేటి సొగటాలు ఆట పారేసి। పాన్పుమీద కొచ్చేను పద్మాయతాక్షి।
గ్రుచ్చి కౌగాలించి ఎత్తి తొడనుంచి। అటుకులు చక్కిలాల్మంచివస్తువులు,
ఈమాట మాఅమ్మకి చెప్పిపంపితేను। యీక్షణము తెప్పిస్తు ఇందీవరాక్షి,
ఆనాడు నీమేడ కొస్తినే దేవి। చాలచిక్కుంటివే చదరాలనీవు
ఆనాడు నీవద్ద నేపవ్వశిస్తే। చాలచోటాయెనే చదరాల నాకు
ఈనాడు నీమేడ కొస్తినేదేవి। చాలనిండుంటివే చదమలదేవి।
నీసుతులు నీవూనపై పవ్వశిస్తే పాదాల క్రిందనే నే పవశిస్తు।
రాజాధిరాజులకు విన్నాపమయ్యా। రాజులక్ష్మిక్కూ విన్నాపమయ్యా।
ఆమాట మీరేల ఆజ్ఞచేసేరు మామీద దయయుంచి మమ్మురక్షించు।
దండంబు దండంబు నీకు రఘురామ। ......

## యక్షగానములో రామాయణాలు

యక్షగానములనగా జక్కులపాటలు. సంగీతముఖ్యములైన దేశి నాటకములు. తొలినాటినుండియు తెలుగు జాతితో పాదుకొని ఉన్నవి. జక్కుల పాటలలో రామాయణ గాథా సంబంధులగు కృతులు లెక్కలేనన్ని ఉన్నవి. సుగ్రీవ విజయము కందుకూరి రుద్రకవి(16 శ.)విరచితము. ధర్మపురి రామాయణము, శేషాక్షి రామాయణము, మోక్షగుండము సుబ్బకవి సీతాకల్యాణము, ఇట్టి వెన్నో. త్యాగరాజు పేరెఱుగని వారుండరు. రామభక్త శిరోమణి. సంగీత కళానిధి, త్యాగరాజస్వామి కీర్తనలు ప్రతిక్షణము భారతదేశమున గానముచేయబడుచునే ఉండును. ఆయన సీతారామవిజయము అను యక్షగానము రచించెను. ఇరువది నాల్గువేల కీర్తనలలో రామాయణమంతయు ఆయన గానము చేసెనట.

ఆదిభట్ట నారాయణదాసు హరికథలుగా వ్రాసిన యథార్థ రామాయణము, జానకీ శపథము తెలుగునేలలో నలుమూలల కీర్తింపబడుచున్నవి. సుబ్రహ్మణ్య కవి అధ్యాత్మ రామాయణ కీర్తనలు సరేసరి. ప్రౌఢమనోహరములు. గురుముఖతః నేర్చుకొని ఆకీర్తనలు పాడగలుగుచున్నవారు విరళముగా ఉన్నారు.

## వచనములో రామాయణాలు

సలక్షణాంధ్ర వచనములో రామాయణము వ్రాసిన వారు అనేకులు. 18వ శతాబ్ది విజయరంగ చొక్కనాథుని కాలమున శ్యామరాయకవి - రామాయణ సుందరకాండ వచనము తుపాకుల అనంతభూపాలుడు - రామాయణము - వేంకటసుబ్బయ - మరియు పైడిపాటి పాపయ్య రంగనాథ రామాయణవచనము-ఇట్టి కొన్ని పైవి దక్షిణాంధ్రయుగమునకు చెందినవి.

శృంగారకవి సర్వారాయకవి (1864 - 1939) తూర్పుగోదావరి మండలము. శ్రీరామ జననము. వచనము కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి శ్రీరామవిజయము-ఇవి కాక, వావిళ్ళ రామస్వామి శాస్త్రి, తంజనగరము తేవప్పెరుమాళ్ళయ్య, నోరి గురులింగశాస్త్రి; సరస్వతుల సుబ్బరామశాస్త్రి గ్రాంథికాంధ్ర గద్యములో రామాయణము వ్రాసిరి. ఉత్తర రామాయణవచనము పెనుమెచ్చ సత్యనారాయణరాజు, నోరి గురులింగశాస్త్రి రచించిన గ్రంథములు ప్రచారమున ఉన్నవి. ముదిగొండ నాగలింగశాస్త్రి, దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజి వాసిష్ఠ రామాయణవచనములు వ్రాసిరి.

వచనానువాదములు అటుండగా, వాల్మీకిరామాయణమునకు చదలువాడ సుందరరామశాస్త్రి - శ్లోకతాత్పర్యములు వ్రాసెను. సుందరరామశాస్త్రి అధ్యాత్మ రామాయణమునకును టీకాతాత్పర్యములు వెలువరించెను. గట్టుపల్లి శేషాచార్యులు వాల్మీకిరామాయణ శ్లోకతాత్పర్యములు - ప్రకటితము. పురాణపండ రామమూర్తి వివరణోపన్యాస రూపముగ అధ్యాత్మ రామాయణమునకు తెలుగు వ్యాఖ్య వ్రాసి ప్రకటించెను. ఈయన సంస్కృత భారతమునకు తెలుగులో వచనముకూడ వ్రాసి పెక్కుపర్వములు వెలువరించెను.

విచిత్రరామాయణము ఉత్కళభాషలో నున్న గ్రంథము. దానిని సలక్షణ వచనములో తెనుగునకు తెచ్చినవాడు గోపీనాథుడు(17 శ.). ఈకవి స్మష్టికరణ వంశజుడట. జయపుర ప్రభువు విశ్వంభర దేవునిచేత సన్మానింపబడినవాడు. వచనశైలి ప్రసన్నము. రామాయణము వచనములో వ్రాసిన వారిలో నెల్ల ఈ గోపీనాథుడు ప్రథముడు కావచ్చును.

## వాడుకభాషలో రామాయణాలు

ఇరువదవ శతాబ్దిలో వ్యావహారిక భాష తెలుగుదేశమున సార్వభౌమ స్థానమున ఉన్నది. గిడుగు రామమూర్తిపంతులుగారి కృషి దీని మూలవిరాట్టు. వాడుక భాషలో వచ్చిన గ్రంథములు బహుళ జనము చదివి ప్రయోజనము పొందుచున్నారు. పాఠకుల అభిరుచులను గుర్తించి ప్రాచీన పండితులు సైతము వాడుక భాషలో గొప్ప రచనలు చేసిరి; చేయుచున్నారు. శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు వ్యావహారిక భాషలో వేలకొలది పుటల వ్యాసములు వ్రాసిరి. భారత భాగవత రామాయణములు కూడ తెనగు వాడుకభాషలోనికి రావలెనని పెద్దలు పెక్కుమంది కాంక్షించిరి. వీరిలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తొట్టతొలుత చెప్పదగినవారు. శాస్త్రిగారు (1891 - 961) రాజమహేంద్రవరవాసి. సంస్కృతాంధ్రములలో పండితులు, "చిన్నకథలు" వ్రాసి ప్రఖ్యాతిపొందినవారు. ఆయన వాల్మీకి రామాయణము మూలకథానుసారము ప్రవాహసుందరమైన వ్యావహారికములో వ్రాసిరి. 1918 ప్రాంతములో అచ్చుపడినది. కాండమున కొక సంపుటము. ఇది సర్వాంధ్రమున వ్యాప్తిగాంచి యున్నది. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వాడుక భాషలోనే భారతముకూడ వ్రాసిరి. వారి దొక ప్రత్యేకమైన శైలి, ఆయన యిట్లు వ్రాసిరి. "రామాయణం మళ్లీ మళ్లీ చదివి క్షుణ్ణంగా బోధపరుచుకున్న మనిషి పూర్ణపురుషు డవుతాడు. మనుష్యజన్మ యెత్తినందుకు ఇదీ మొదట సాధించుకోవలసిన అంతరువు".

శ్రీనివాస శిరోమణి "రామాయణము" సుగమమైన సుందరమైన శైలిలో ఆంధ్ర పత్రికలో బహువారము ప్రకటితమై వచ్చినది. వేలకొలది పాఠకులను సమావర్జించినది. ఆయన వ్యావహారికము మంచి ఒయ్యారమైనది.

పురిపండా అప్పలస్వామిగారు ఒకరు వాడుకభాషలో చాలా గ్రంథములు వ్రాసిన ప్రసిద్ధులు. భారత భాగవత రామాయణములు మూడింటిని వ్యావహారికాంధ్రమున రచించిరి కళాప్రపూర్ణ బిరుదాంకితులు. శ్రీకాకుళము మండలమునకు చెందిన సాలూరు వీరి అభిజనము. జననము 1904. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ విశిష్టసభ్యులు. ఆధునిక కవిలోకమున పేర్వాసిన వారు. అప్పలస్వామిగారి రామాయణము వ్యావహారిక వచనము; సూటిగా సురుచిరముగా సకల గమ్య సుతీర్ణముగా ఉండును, నడకలో కొన్ని ఒడుపులున్నవి. తెలుగు పాఠకలోకమును వేసినంత ఆకర్షించుచున్నది. పిల్లల రామాయణములు బొమ్మల రామాయణములు వచ్చినవి.

ఆకాశవాణి ఒక రామాయణము ప్రచారము చేయుచున్నది. లక్షలాది బాలబాలికలను స్త్రీ పురుషులను యువక వృద్ధులను ఈ రామాయణము వలవైచు కొనుచున్నది. భాష శక్తివంతమైన వ్యావహారికము. ఉషశ్రీ రచన. ఈయన కంఠములో భారతముకూడ తెలుగువారు శ్రద్ధగా విన్నారు 'ఉషశ్రీ' కలము పేరు, అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. విజయవాడ రేడియో ఉద్యోగి. పూర్వ సంప్రదాయము, ఆధునిక సంస్కారము తెలిసిన పలుకుబడి. ఈయన గొంతునుండి వచ్చిన రామాయణము ఆకాశవాణి రామాయణముగా, ఉషశ్రీ రామాయణముగా వ్యాప్తిలోనికి వచ్చుచున్నది.

మఱి పెక్కుమంది రచయితలు రామాయణమును సలక్షణాంధ్రముతో వ్యావహారికాంధ్రములో వ్రాసి తెలుగు చదువరులకు విందులు చేసినవారున్నారు. ఒకటేమిటి? తెలుగులో సర్వవిధ సారస్వత ప్రక్రియలయందును రామాయణము తన విరాడ్రూపమును దర్శింపజేయుచున్నది.

రామగాథాత్మకములగు అనర్ఘరాఘవ, మహావీర చరిత్రాదికములను సంస్కృతమునుండి అనువాదములు చేయుట యొకటి. స్వతంత్రముగా పానుగంటి లక్ష్మీనరసింహారావు, కోలాచలము శ్రీనివాసరావు, ధర్మవరము రామకృష్ణమాచార్యులు మున్నగు ప్రఖ్యాత కవులు రచించిన పాదుకాపట్టాభిషేకము

వంటి నాటకములు తెలుగునాట నలుమూలల బహుళాదరము రంగస్థలముల యందు ప్రదర్శితములై పేరుపొందినవి. తెలుగు శతకాలలో, తెలుగు దండకాలలో, ఖండ కావ్యాలలో, రామదాస కీర్తనలలో రామాయణగాథ తీగమెరుపులుగా మిరుమిట్లు గొల్పుచున్నది

అనంతమైన విషయము: ప్రత్యేక గ్రంథములో వివరించినను కొంచెమే చెప్పినట్లగును. శ్రీరావూరి దొరసామిశర్మగారు మదరాసు వైష్ణవ కళాశాల ఆంధ్రోపన్యాసకులు. వారు పరిశ్రమించి "తెలుగు సాహిత్యము : రామకథ" అను పేరితో ఒక మహాగ్రంథమే వ్రాసినారు మరికొందరు చేయుచున్న పరిశీలనలను గూర్చి వినుచున్నాము

తెలుగులో రామాయణాలు

ఈ మహాజగత్తున నాయొక్క పరిమితము; ఏర్పరచిన పుటలు సంఖ్యయు పరిమితము. యథామతి యథాస్మృతి సాగిన ఈ కృతి శ్రీరామార్పితము

—: 0 :—